


www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం
# నవభూమి
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక
Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 09 బుధవారం | జనవరి 2025 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 113

Navabhoomi daily fallows..




# స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారుస్తా



- 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్‌గా అభివృద్ధి చేయడమే లక్ష్యం
- ఏపీలో ప్రగతి పరుగులు తీస్తుంది..2047 నాటికి 2.5 ట్రిలియన్
- డాలర్ల లక్ష్యాన్ని సాధించడానికి, ఎన్డీఏతో కలిసి ఏపీ పని చేస్తుంది
- దేశ అభివృద్ధిలో ఏపీ కీలక పాత్ర పోషించడమే కాకుండా అభివృద్ధి దిశగా అడుగులు
- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రతి మాటను గౌరవిస్తా
- కలిసికట్టుగా లక్ష్యాలను సాధిస్తామని ప్రధాని మోదీ స్పష్టీకరణ
- ఏపీ అభివృద్ధి మా ఇద్దరి విజన్ : ప్రధాని నరేంద్ర మోదీ

2

**విశాఖపట్నం-నవభూమిబ్యూరో**
భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారీ వరాలను ఇచ్చారు. విశాఖలో 2.85 లక్షల కోట్ల విలువైన

# తిరుమలలో తొక్కిసలాట



- తిరుపతి తోపులాటలో ఆరుగురు భక్తుల మృతి
- వైకుంఠ ద్వార సర్వ దర్శనం కోసం టోకెన్లను టీటీడీ జారీ చేస్తుందని ప్రకటన
- వెల్లువలా వచ్చిన భక్తులు..టోకెన్ల కేంద్రాల వద్ద తోపులాటతో దుర్ఘటన
- ముగ్గురు మహిళలతో ఆరుగురు భక్తులు దుర్మరణం
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం
- ప్రధాని మోదీ,సీఎం చంద్రబాబు,పవన్ కళ్యాణ్ దిగ్భ్రాంతి
- క్షతగాత్రులను పరామర్శించేందుకు నేడు సీఎం,డిప్యూటీ సీఎం రాక

2

**తిరుమల-నవభూమిబ్యూరో**
తిరుపతిలోని శ్రీనివాసం, సత్యనారాయణపురం బైరాగిపట్టెడ రామానాయుడు స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాలలో భక్తుల మధ్య భారీ ఎత్తున తోపులాట జరిగింది.వైకుంఠ ద్వారం చూడాలని ఉత్తర ద్వారం ద్వారా స్వామిని దర్శించుకుంటే పుణ్యం వస్తుందని భావించిన భక్తులకు స్వర్గ ద్వారాలే తెరచుకున్నాయి. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఏకంగా ఆరుగురు భక్తులు తమ ప్రాణాలను కోల్పోయారు. ఈ విషాదం ఇపుడు ఆధ్యాత్మిక భూమిలో ఆందోళన కలిగిస్తోంది. గురువారం వైకుంఠ ద్వార సర్వ దర్శనం కోసం టోకెన్లను టీటీడీ జారీ చేస్తుందని ప్రకటన రావడంతో భక్తులు వెల్లువలా వచ్చారు. దీంతో బుధవారం సాయంత్రం నుంచే భక్తులు అత్యధిక సంఖ్యో టోకెన్లు ఇచ్చే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. తిరుపతిలోని శ్రీనివాసం, సత్యనారాయణపురం బైరాగిపట్టెడ రామానాయుడు స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాలలో భక్తుల మధ్య భారీ ఎత్తున తోపులాట జరిగింది. గురువారం

### తిరుపతి ఘటనపై సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ దిగ్భ్రాంతి

**తిరుపతి-నవభూమి:** వైకుంఠ ద్వారా దర్శనం టోకెన్ల జారీ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో భక్తులు మృతి చెందడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటన తనను ఎంతో కలచి వేసిందన్నారు. అస్వస్థతకు గురైన బాధితులకు అందుతున్న వైద్య చికిత్సపై అధికారులతో సీఎం చంద్రబాబు మాట్లాడారు.

# ప్రపంచం మెచ్చిన ఏకైక నాయకుడు మోడీ

- అలాంటి ప్రధాని మీరొక్కరే.. మోడీని ఆకాశానికెత్తేసిన చంద్రబాబు
- రూ. 2 లక్షల కోట్ల అభివృద్ధి పనులు ఏకకాలంలో ప్రారంభం
- కావడం నా జీవితంలో ఎప్పుడూ చూడలేదు
- విశాఖ ప్రజల చిరకాల వాంఛ అయిన రైల్వే జోన్ కల నెరవేరింది
- ఇకపై విజయాలే తప్ప అపజయాలు ఉండవు
- ఢిల్లీ ఎన్నికల్లోనూ ఎన్డీఏ గెలుస్తుందని జోస్యం చెప్పిన చంద్రబాబు

2



**విశాఖపట్నం-నవభూమిబ్యూరో**
విశాఖపట్నం ప్రధాని నరేంద్ర మోడీపై ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశంసల వర్షం కురిపించారు. ప్రపంచం మెచ్చిన ఏకైక నాయకుడు ప్రధాని మోడీ అంటూ కొనియాడారు. బుధవారం ఏపీలో రూ. 2.08 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రధాని మోడీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ప్రధాని మోడీ, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తోపాటు చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. విశాఖపట్నంలో మోడీ రోడ్ షో అదిరిందన్నారు చంద్రబాబు. ఎక్కడికి పోయినా మోడీపై విశ్వాసం, నమ్మకం ప్రజలకు కలుగుతోందని అన్నారు. రూ. 2 లక్షల కోట్ల

# జనంలోకి జగన్

- జగన్ ఇక జనంలోకి వెళ్లాలని నిర్ణయం
- ఈనెల 16న యూకేకు వెళ్లనున్న జగన్
- అక్కడి నుంచి వచ్చిన తర్వాత టూర్లు
- ప్రతీ వారం రెండు రోజులు ఒక్కో జిల్లాలో సమీక్షలు..
- కార్యకర్తలతో మమేకం అయ్యేలా జగన్ ప్లాన్ ఫిక్స్



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
మాజీ సీఎం జగన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇక పార్టీ - ప్రజల్లోనే ఉండాలని డిసైడయ్యారు. ఈ మేరకు కార్యాచరణ ఫిక్స్ చేసారు. జగన్ యూకే వెళ్లేందుకు తాజాగా హైకోర్టు నుంచి అనుమతి వచ్చింది. ఐదేళ్ల గడువుతో ఆయనకు పాస్‌పోర్టు మంజూరు చేయాలని అధికారులను న్యాయస్థానం ఆదేశించింది. 16న యూకేలో జరగనున్న కుమార్తె గ్రాడ్యుయేషన్ డేకు జగన్ సతీ సమేతంగా హాజరు కానున్నారు. వస్తూనే ఇక.. జిల్లాల పర్యటనకు జగన్ షెడ్యూల్ ఖరారైంది. కోర్టు అనుమతితో మాజీ సీఎం జగన్ ఇక పార్టీ కేడర్ - ప్రజల మధ్యనే ఉండాలని నిర్ణయించారు. తాజాగా జగన్ కు హైకోర్టులో రిలీఫ్ దక్కింది. జగన్ కు అయిదేళ్లు కాల పరిమితితో పాస్ పోర్టు మంజూరుకు హైకోర్టు అనుమతి ఇచ్చింది. తాను యూకే వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని జగన్ కోర్టును ఆశ్రయించారు. ఇప్పుడు కోర్టు నుంచి రిలీఫ్ దక్కటంతో ఈ నెల 11వ తేదీ నుంచి 25వ తేదీ వరకు లండన్ పర్యటనకు వెళ్లనున్నారు. కుమార్తె గ్రాడ్యుయేషన్ డే కు హాజరవుతారు. ఇప్పటికే జగన్ పలు జిల్లాలకు కొత్త అధ్యక్షుల ను నియమించారు. జిల్లా కమిటీల పైన నిర్ణ యం తీసుకున్నారు. జిల్లాల పర్యటన లండన్ పర్యటన నుంచి వచ్చిన తరువాత ఈ నెల 29వ తేదీ నుంచి జిల్లాల పర్యటన ప్రారంభం అయ్యేలా ప్రాథమికంగా షెడ్యూల్ ఫిక్స్ చేసారు. ఏదైనా కారణాలతో వాయిదా పడితే ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ప్రారంభించా లని డిసైడ్ అయ్యారు. ప్రతీ వారం రెండు రోజులు ఒక్కో జిల్లాలో సమీక్షలు.. కార్యకర్తలతో

# సర్కార్ గేమ్ చేంజర్

- గేమ్ చేంజర్ సినిమాకు తెలంగాణ సర్కార్ శుభవార్త
- టికెట్ రేట్లు పెంచుకునేందుకు అనుమతి
- బెనిఫిట్ షోలకు అనుమతి లేదు
- సినిమా ప్రదర్శించబడే థియేటర్లలో నార్కోటిక్,డ్రగ్స్, సైబర్ క్రైమ్‌పై అవగాహన కలిగించాలి

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
ఒక వైపు ఏపీలో 'గేమ్ చేంజర్' సినిమాకు ఏం కావాలంటే అది ప్రభుత్వం అనుమతి ఇస్తుంది. తెలంగాణలో మాత్రం రీసెంట్‌గా జరిగిన ఘటనతో కొన్ని ఆంక్షలు ఉండటంతో.. 'గేమ్ చేంజర్' సినిమాకు టికెట్ల రేట్లు పెంచడం కష్టమే అని అంతా అనుకుంటున్న సమయంలో తెలంగాణ ప్రభుత్వం చిత్రయూనిట్‌కు, ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్ చెప్పింది. అదేమంటే.. 'పుష్ప 2' సంధ్య థియేటర్ ఘటన తర్వాత తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణ వ్యాప్తంగా బెనిఫిట్ షోలకు, టికెట్ల ధరల పెంపుకు

# బీఆర్ఎస్‌కు కొత్త అధ్యక్షుడు

- కేటీఆర్ అరెస్ట్ నేపథ్యంలో పార్టీ కీలక నిర్ణయం..!!
- స్వయంగా ప్రకటించిన వర్కింగ్ ప్రెసిడెంట్
- ఈ ఏడాది పార్టీకి కొత్త అధ్యక్షుడి నియామకం
- 2025లో బీఆర్ఎస్‌కు కొత్త కమిటీలు
- గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి కమిటీలు

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కేటీఆర్ పైన ఫార్ములా ఈ రేసు కేసులో ఏసీబీ వేగంగా ముందుకెళ్తోంది. ఇద్దరు అధికారులను ఈ రోజు ఏసీబీ విచారిస్తోంది. రేపు కేటీఆర్ విచారణకు హాజరు కానున్నారు. మొన్న కవిత.. ఇప్పుడు కేటీఆర్ కేసులతో చిక్కులు ఎదుర్కొంటున్నారు. వీటిని గమనిస్తున్నా.. కేసీఆర్ స్పందించటం లేదు. ఈ సమయంలో బీఆర్ఎస్‌కు కొత్త అధ్యక్షుడి నియామకం పైన చర్చ మొదలైంది. కీలక పరిణామాలు కేటీఆర్ పైన ఫార్ములా ఈ రేసు కేసు విచారణ వేళ రాజకీయంగా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. పార్టీ నేతలతో కేటీఆర్, హరీష్ సమావేశమయ్యారు. కేసు విచారణ వేళ కీలక వ్యాఖ్యలు చేసారు. కేసు గురించి తాను

# ఇంటర్ విద్యలో సమూల మార్పులు

- సలహాలు, సూచనలకు ఆహ్వానం పలికిన ఏపీ ప్రభుత్వం
- ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉన్న అవసరాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థకు కొత్త రూపు
- తల్లిదండ్రులు, విద్యార్థులు, విద్యా రంగ నిపుణుల నుంచి అభిప్రాయ సేకరణ
- కొత్త పాఠ్య పుస్తకాలు విద్యార్థులకు తాజా సమాచారం, నైపుణ్యానికి తర్ఫీదు

2



**అమరావతి-నవభూమిబ్యూరో**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యలో సమగ్రమైన మార్పులకు, సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. విద్యార్థుల అభివృద్ధిని, భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉన్న అవసరాలకు అనుగుణంగా విద్యా వ్యవస్థకు కొత్త రూపు ఇవ్వాలని ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో... తల్లిదండ్రులు, విద్యార్థులు, విద్యా రంగ నిపుణుల నుంచి అభిప్రాయ సేకరణ జరిపి, ఈ సమాచారం ఆధారంగా కొన్ని కీలక ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

**ప్రతిపాదనలు...**పాఠ్య ప్రణాళిక పాఠ్య పుస్తకాల పునర్వ్యమర్శ: ప్రస్తుత ప్రపంచంలో జరుగుతున్న త్వరితగతి మార్పుల నేపథ్యంలో, పాఠ్య ప్రణాళికను నవీకరించడం అత్యంత అవసరం. కొత్త పాఠ్య పుస్తకాలు విద్యార్థులకు తాజా సమాచారం నైపుణ్యాలను అందిస్తాయి.

**కొత్త సబ్జెక్ట్ కాంబినేషన్లు:** విద్యార్థులకు వారి ఆసక్తులకు అనుగుణంగా సబ్జెక్టులను ఎంచుకునే స్వేచ్ఛను ఇవ్వడం మంచి నిర్ణయం. ఇది వారిలో సృజనాత్మకతను పెంపొందిస్తుంది.

**పరీక్ష మార్కుల నమూనాలో మార్పులు:** రొటీన్ అభ్యాసాన్ని తగ్గించి, విద్యార్థుల సమగ్ర అభివృద్ధిపై దృష్టి పెట్టడం మంచి విషయం.

**ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర బోర్డు పరీక్షలను తొలగించడం:** విద్యార్థులపై ఉన్న ఒత్తిడిని తగ్గించడానికి ఇది మంచి నిర్ణయం. ఇంటర్మీడియట్ విద్యా సంస్కరణలు రాష్ట్ర విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఏపీ ప్రభుత్వం విశ్వసిస్తోంది.

ఈ సంస్కరణలు విద్యార్థులను గ్లోబల్ సిటిజన్లుగా తీర్చిదిద్దడానికి తోడ్పడతా యని, అయితే, ఈ సంస్కరణలు విజయవంతం కావాలంటే, అన్ని వర్గాల ప్రజల సహకారం అవసరం అని రాష్ట్ర విద్యాశాఖ భావిస్తోంది. ఈ క్రమంలో తాజా ప్రతిపాదనలపై సలహాలు, సూచనలు, అభిప్రాయాలను ఆహ్వానిస్తోంది.

# మే 1 నుంచి ఉద్యోగాలకు నోటిఫికేషన్లు

- మార్చి 31లోగా ఉద్యోగ ఖాళీల వివరాలను ఇవ్వాలని సర్కార్‌కు వినతి
- ఖాళీల మేరకు నోటిఫికేషన్లు జారీపై ఏప్రిల్ నెలలో కసరత్తు
- కొత్త నోటిఫికేషన్లు ఇచ్చి 6-8 నెలల్లో భర్తీ ప్రక్రియ పూర్తి
- షెడ్యూల్ ప్రకారమే ఫలితాలు వచ్చేలా పనిచేస్తున్నాం
- టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం వెల్లడి

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో**
తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగార్థులకు శుభవార్త చెప్పింది. మే 1 నుంచి కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేస్తామని టీజీపీఎస్సీ ప్రకటించింది. మార్చి 31లోగా ఉద్యోగ ఖాళీల వివరాలను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు వెల్లడించింది. ఖాళీల మేరకు నోటిఫికేషన్లు జారీపై ఏప్రిల్ నెలలో కసరత్తు చేస్తామని పేర్కొంది. కొత్త నోటిఫికేషన్లు ఇచ్చి 6-8 నెలల్లో భర్తీ ప్రక్రియ పూర్తి చేస్తామని టీజీపీఎస్సీ ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారమే ఫలితాలు వచ్చేలా పనిచేస్తున్నామని టీజీపీఎస్సీ ఛైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు. అభ్యర్థులెవరూ ఆందోళన చెందవద్దని ఆయన భరోసా ఇచ్చారు. నిరుద్యోగులకు టీజీపీఎస్సీపై నమ్మకం కలిగేలా పనిచేస్తున్నామని బుర్రా వెంకటేశం చెప్పారు. ఫలితాల ఆలస్యానికి

# మద్యం ప్రియులకు షాక్..

- తెలంగాణా రాష్ట్రంలో కింగ్ ఫిషర్ బీర్ల సరఫరా బంద్..
- తెలంగాణకు తమ బీర్లను సప్లయ్ చేయబోమంటూ తేల్చి చెప్పిన యునైటెడ్ బ్రేవరేస్ లిమిటెడ్
- బీర్ల ధరలను సవరించకపోవడంతో పాటు.. పాత బకాయిలను తెలంగాణ ప్రభుత్వం చెల్లించక పోవడంతోనే ఈ నిర్ణయం

2





**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** తెలంగాణలో మద్యం ప్రియులకు షాకింగ్ న్యూస్ ఇది. ఇక నుంచి తెలంగాణలో కింగ్ ఫిషర్, హీనెకెన్ బీర్ల అమ్మకాలు బంద్ కానున్నాయి. ఇందుకు కారణం.. ఆ బీర్ల తయారీ కంపెనీ తీసుకున్న నిర్ణయమే. అవును.. తెలంగాణకు తమ బీర్లను సప్లయ్ చేయబోమంటూ యునైటెడ్ బ్రేవరేస్ లిమిటెడ్ తేల్చి చెప్పింది. ఈ మేరకు బుధవారం నాడు అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేసింది. బీర్ల ధరలను సవరించకపోవడంతో పాటు.. పాత బకాయిలను తెలంగాణ ప్రభుత్వం చెల్లించక పోవడంతోనే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు కంపెనీ స్పష్టం చేసింది. కంపెనీ తీసుకున్న ఈ నిర్ణయంతో.. తెలంగాణలో కింగ్ ఫిషర్, హీనెకెన్ బీర్ల సరఫరా నిలిచిపోనుంది.

**కంపెనీ ప్రకటనలో ఏముందంటే..**
సెబీ లిస్టింగ్ రెగ్యులేషన్స్‌లోని రెగ్యులేషన్ 30కి ప్రకారం.. తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్‌కి తమ బీర్ సరఫరాను తక్షణమే నిలిపివేస్తున్నట్లు యునైటెడ్ బ్రేవరేస్ లిమిటెడ్ తన లేఖలో పేర్కొంది. టీజీబీసీఎల్ బీర్ల ప్రాథమిక ధరను 2019 నుంచి ఇప్పటి వరకు సవరించలేదని.. దీని కారణంగా రాష్ట్రంలో భారీగా నష్టాలు వస్తున్నాయని పేర్కొంది. అలాగే.. బీర్ల సరఫరాకు సంబంధించి తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ చాలా బకాయి పడిందని.. ఆ బిల్లులు చెల్లించకపోవడంతో కంపెనీ



## కిరాణా వ్యాపారి కిడ్నాప్

**వడ్డేపల్లి:-నవభూమి:**ఓ కిరాణా వ్యాపారిని కిడ్నాప్ అయ్యా రు. ఆయనను విడిచిపెట్టేందుకు రూ.10 లక్షలు డిమాండ్ చేశారు కిడ్నాపర్లు. వారిని పోలీసులు చాకచక్యంగా పట్టుకుని వ్యాపారిని రక్షించినట్లు సమాచారం. ఈ ఘటన జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగింది. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల పట్టణం శాంతినగర్‌కుచెందిన రమేశ్ బాబు అనే వ్యాపారికి ఒక వ్యక్తి లక్ష రూపాయలు ఇవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి సోమవారం ఉదయం రమేశ్‌కు ఫోన్ చేసి ఆ లక్ష రూపాయలు ఇస్తానని హైదరాబాద్‌కు వచ్చి తీసుకోవాలని చెప్పాడు. దాంతో రమేశ్ హైదరాబాద్ వెళ్లగా, ఇద్దరు వ్యక్తులు అతడిని కలిసి తీసుకెళ్లి ఓ అపార్ట్‌మెంట్‌లో బంధించి హింసించారు. అతడితో భార్యకు ఫోన్ చేయించి రూ.10 లక్షలు కావాలని చెప్పించారు. ఆందోళనకు గురైన రమేశ్ భార్య మంగళవారం శాంతినగర్ పోలీసస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు రమేశ్ సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా హైదరాబాద్‌లో అతడు ఉన్న ప్రాంతాన్ని గుర్తించారు. రమేశ్‌ను రక్షించి కిడ్నాపర్లను శాంతినగర్‌కు తీసుకొచ్చినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. కిడ్నాపర్లలో శాంతినగర్‌లోని ఓ మొబైల్ షాపు వ్యక్తి, కల్కుంట్ల గ్రామానికి చెందిన మరో వ్యక్తి, హైదరాబాద్‌కు చెందిన మరో ముగ్గురు ఉన్నట్లు సమాచారం. సంఘటనకు సంబంధించి శాంతినగర్ సీఐ టాటాబాబును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.



## హన్సిత, అనిల్ కేస్.. తెలుగు రాష్ట్రాల్లో ఐటీ సోదాలు





**హైదరాబాద్-నవభూమి:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఐటీ సోదాలు కలకలం రేపుతున్నాయి. ఆంధ్ర, తెలంగాణలో సుమారు 12 ప్రాంతాల్లో ఐటీ సోదాలు నిర్వహిస్తోంది. హైదరాబాద్‌లో నాలుగు చోట్ల తనిఖీలు జరుగుతుండగా.. ఆంధ్రాలో ఎనిమిది చోట్ల సోదాలు జరుగుతున్నట్లు సమాచారం. రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఇళ్లతో మైన్స్ యజమానులకు చెందిన ఇళ్లల్లోనూ, కార్యాలయాల్లోనూ ఈ రైడ్స్ జరుగుతున్న ట్లు తెలుస్తోంది. రియల్ లైఫ్ బంటి, బబ్లీ కేసులో ఐటీ సోదాలు నిర్వహిస్తోంది. భువనేశ్వర్‌లో అరెస్ట్ అయిన హన్సిత , అనిల్ కుమార్ మహంతి కేసులో సోదాలు కొనసాగుతున్నాయి. ప్రధాన మంత్రి ప్రిన్సిపల్ సెక్రెటరీ పీకే మిశ్రకు అల్లుడు, కూతురు అని చెప్పుకుంటూ హన్సిత, అనిల్ వసూళ్లకు పాల్పడ్డారు. మొత్తం 12 ప్రాంతాల నుంచి రూ.100 కోట్లకుపైగా వీరుఇద్దరు వసూళ్లకు పాల్పడ్డారు. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో తిరుగుతూ ప్రిన్సిపల్ సెక్రెటరీ పేరుని వాడుకున్న హన్సిత, అనిల్.. ప్రభుత్వంలో పనులు చేయిస్తామంటూ పలు కంపెనీల నుంచి డబ్బులు వసూలు చేశారు.
రెండు రోజుల క్రితం భువనేశ్వర్‌లో హన్సిత, అనిల్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో భాగంగా వీరి నుంచి కీలక సమాచారాన్ని పోలీసులు రాబట్టారు. హన్సిత, అనిల్ ఇచ్చిన సమాచారంతో 12 ప్రాంతాల్లో ఐటీ సోదాలు చేపడుతోంది. హైదరాబాద్, ఆంధ్ర, భువనేశ్వర్, ఢిల్లీ, ఝూర?ండ్‌లోని పలు ప్రాంతాల్లో సోదాలు జరుగుతున్నాయి. వసూళ్లు చేసిన డబ్బులతో హన్సిత, అనిల్ లగ్జరీ లైఫ్‌ను ఎంజాయ్ చేసినట్లు ఐటీ అధికారులు గుర్తించారు. లగ్జరీ కార్లు , అధునాతన విల్లాలతో పాటు లైఫ్‌ను ఎంజాయ్ చేశారు హన్సిత, అనిల్. ఇన్కమ్ టాక్స్ లేకుండా చేస్తానంటూ కంపెనీల నుంచి వసూల్లో పాల్పడ్డారు వీరిద్దరు. టాక్స్ ఎగ్గొట్టేందుకు హన్సిత, అనిల్‌లకు కంపెనీలు పెద్ద మొత్తంలో లంచాలు ఇచ్చినట్లు పోలీసులు గుర్తించారు. దేశవ్యాప్తంగానే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాల్లోని పలువురు ఈ ఇద్దరికి ముడుపులు ముట్టజెప్పినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఆంధ్ర, తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా పలు చోట్ల సోదాలు కొనసాగుతున్నాయి. ఎవరెవరైతే ఈ జంటకు లంచాలో అప్పజెప్పారో వారి ఇళ్లలో ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు.
కాగా.. ప్రధానమంత్రి ప్రిన్సిపల్ సెక్రెటరీ కూతురు, అల్లుడినంటూ హన్సిత, అనిల్‌ను భారీగా డబ్బుల వసూళ్లకు పాల్పడ్డారు. ముఖ్యంగా మైనింగ్, నిర్మాణ రంగాల్లో ఉన్న ధనవంతులను టార్గెట్ చేస్తూ ప్రభుత్వ టెండర్లు ఇప్పిస్తామని నమ్మించేవారు. అందుకు సంబంధించిన ఫోటోలు, ఫేక్ సంబంధాలను చూపించి బాధితుల నుంచి భారీగా డబ్బులు వసూళ్లు చేశారు. ఈ క్రమంలో మోసానికి గురైన ఓ గనుల వ్యాపారి ఇచ్చిన ఫిర్యాదుతో రీయల్ బంటి, బబ్లీ కేసు వెలుగులోకి వచ్చింది. కేసు నమోదు చేసిన భువనేశ్వర పోలీసులు దర్యాప్తు చేపట్టగా... ఈ దంపతులకు సంబంధించి అనేక విషయాలు బయటపడ్డాయి. చాలా మంది వద్ద నుంచి కోట్ల రూపాయలు మోసం చేసినట్లు ఆధారాలు లభించాయి. వీరి భారిన పడి మోసపోయిన వారు ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలన్న పోలీసులు కోరారు.

## ఓయూ పరిధిలో వివిధ కోర్సుల పరీక్షా తేదీల ఖరారు




**హైదరాబాద్-నవభూమి:** ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (సీబీసీఎస్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్) తదితర కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 21వ తేదీ నుంచి, మాస్టర్ ఆఫ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎండీహెచ్‌ఎం) మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 24వ తేదీ నుంచి, ఎంబీఏ (ఈవినింగ్) అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 25వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ %www.osmania.ac.in%లో చూసుకోవచ్చని సూచించారు.

## మే 1 తర్వాతే కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు : టీజీపీఎస్సీ




**హైదరాబాద్-నవభూమి:** కొత్త ఏడాదిలో కొత్త ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు టీజీపీఎస్సీ బ్యాడ్ న్యూస్ వినిపించింది. ఇప్పట్లో కొత్త నోటిఫికేషన్లు లేవని టీజీపీఎస్సీ చెప్పకనే చెప్పింది. మే 1వ తేదీ నుంచి కొత్త ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేస్తామని టీజీపీఎస్సీ వెల్లడించింది. మార్చి 31వ తేదీలోగా ఉద్యోగ ఖాళీల వివరాలను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపింది. ప్రభుత్వం ఇచ్చిన ఖాళీలపై కసరత్తు చేసి మే 1 నుంచి నోటిఫికేషన్లు ఇస్తామని పేర్కొంది. నోటిఫికేషన్లు జారీ అయ్యాక 6 నుంచి 8 నెలల లోపు ఉద్యోగాల భర్తీ చేపడుతామని స్పష్టం చేసింది.ఇక గ్రూప్ -3కి సంబంధించి ప్రాథమిక కీ విడుదల చేసింది టీజీపీఎస్సీ. జనవరి 12వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు తెలిపింది. ఇక గ్రూప్ -2 ప్రాథమిక కీ కూడా మరో రెండు రోజుల్లో విడుదల చేయనున్నట్లు టీజీపీఎస్సీ ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం ఫలితాలు వచ్చేలా పని చేస్తున్నట్లు టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం తెలిపారు.

## తెలంగాణలో ఈనెల 10 నుంచి ఆరోగ్య శ్రీ సేవలు బంద్..!?



**హైదరాబాద్-నవభూమి:**తెలంగాణలో ఈ నెల 10వ తేదీ నుంచి ఆరోగ్య శ్రీ సేవలు నిలిపివేయనున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు నెట్‌వర్క్ ఆస్పత్రులు డెడ్‌లైన్ విధించాయి. ఏడాది కాలంగా పెండింగ్ బకాయిలు చెల్లించలేదని ఆరోపించిన నెట్ వర్క్ హాస్పిటల్స్.. 10వ తేదీని డెడ్ లైన్‌గా విధించటం గమనార్హం. బకాయిలు పెండింగ్ పెట్టటం వల్ల తాము ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని.. ఆస్పత్రి యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రూ. 675 కోట్లు బకాయిలు చెల్లించలేదని ఆస్పత్రులు తెలిపాయి.అయితే.. రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ఏడాదిలో 920 కోట్ల రూపాయలు ఆరోగ్య శ్రీకి చెల్లించిందని.. ఇప్పటికీ ఇంకా రూ. 600 కోట్ల రూపాయలు బకాయిలున్నాయని ఆస్పత్రుల యాజమాన్యాలు తెలిపాయి. గతంలో ఫస్ట్ క్లెయిమ్ ఫస్ట్ పెమెంట్ ఉండేదని.. ప్రస్తుతం కేవలం ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల బకాయిలు చెల్లించాల్సి ఉందని.. తమకు 2 నెలలకు ఒక్కసారి మాత్రమే కొద్దిపాటి చెల్లింపులు చేయడంతో పెండింగ్ బకాయిలు ఉన్నాయని నెట్వర్క్ హాస్పిటల్స్ ఆరోపించాయి.
ఇదిలా ఉంటే.. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీల్లో ఒకటైన ఆరోగ్య శ్రీ పరిధి పెంపు హామీని అన్నింటి కంటే ముందే అమలు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన వేళ.. ప్రజలకు ఆరోగ్యశ్రీ కింద వైద్య ఖర్చుల పరిధిని 10 లక్షల రూపాయలకు పెంచుతూ రేవంత్ రెడ్డి సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పథకం.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో అమలులోకి వచ్చింది. అంతేకాకుండా.. ఇందులో ఇప్పటికే ఉన్న పలు వైద్యాలతో పాటు మరికొన్ని వైద్యాలను కూడా ప్రభుత్వం చేర్చింది.
దీంతో.. నిరుపేదలు తమ అనారోగ్య సమస్యలకు ఆరోగ్య శ్రీ కింద నాణ్యమైన వైద్యసేవలు పొందుతున్నారు. ఫలితంగా.. నెట్ వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ లబ్ధిదారుల సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతుండటం.. వారి వైద్య సేవలు అందించి అందుకు సంబంధించిన ఖర్చును ప్రభుత్వానికి పంపిస్తోంది. అయితే.. ఆస్పత్రులకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నప్పటికీ.. గత ప్రభుత్వం నుంచి వస్తున్న కొన్ని పెండింగ్ బకాయిలు అలాగే కొనసాగుతుండటం గమనార్హం. వాటిని వెంటనే క్లియర్ చేయాలంటూ నెట్ వర్క్ ఆస్పత్రులు ప్రభుత్వానికి డెడ్ లైన్ విధించాయి.మరి నెట్ వర్క్ ఆస్పత్రులు విధించిన పదో తారీఖు లోపల పెండింగ్ బకాయిలు చెల్లించకపోతే.. నిజంగానే ఆరోగ్య శ్రీ సేవలు నిలిచిపోతాయా.. లేకపోతే ప్రభుత్వం ఏదైనా పరిష్కారం ఆలోచిస్తుందా.. లేదా బకాయిలు చెల్లించి ఆస్పత్రులకు ఉపశమనం కలిగిస్తుందా అన్నది చూడాల్సి ఉంది.

## హుస్సేన్ సాగర్‌కు సరికొత్త అందాలు.. చుట్టూ స్కైవాక్, సైకిల్‌ట్రాక్



**హైదరాబాద్-నవభూమి:** హైదరాబాద్ నగరంలో అనేక చూడదగ్గ ప్రదేశాలు ఉన్నాయి. అందులో ప్రముఖమైనది హుస్సేన్ సాగర్. వీకెండ్ డేస్‌లో లక్షల మంది హుస్సేన్ సాగర్ చుట్టూ ఉన్న పార్కులు, సందర్శన ప్రాంతాలకు ఎంజాయ్ చేసేందుకు వస్తుంటూరు. ఈ నేపథ్యంలో టూరిస్టులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు హెచ్ఎండీఏ ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగా సాగర్ చుట్టూ 10 కి.మీ మేర స్కైవాక్, సైకిల్‌ట్రాక్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న హుస్సేన్ సాగర్ పర్యాటకులకు సరికొత్త అనుభూతిని పంచనుంది. ఇప్పటికే సాగర్ ఒడ్డున అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహం, తెలంగాణ అమరవీరుల జ్ఞాపకార్థం నిర్మించిన అమర జ్యోతి, కొత్త సెక్రటేరియట్, ట్యాంక్‌బండ్, కొత్త సెక్రటేరియట్, ఎన్టీఆర్ గార్డెన్, నెక్లెస్‌రోడ్డు, సంజీవయ్యపార్కు, లుంబినీపార్కు టూరిస్టులను విశేషంగా ఆకర్షిస్తుండగా.. తర్వలోనే సాగర్ చుట్టూ మరో కీలక టూరిస్ట్ ప్రాజెక్టు నిర్మించున్నారు. హుస్సేన్‌సాగర్ సరికొత్త రూపు సంతరించుకోనుంది.సాగర్ చుట్టూ మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ప్రణాళిక రచిస్తోంది. హైదరాబాద్ హుస్సేన్ సాగర్ వద్దకు వెళ్లేందుకు చాలా మంది మెట్రోలను ఆశ్రయిస్తారు. వారు ఖైరతాబాద్ స్టేషన్‌లో దిగి అక్కడి నుంచి నడిచుకుంటూ.. ఐమాక్స్ మీదుగా హుస్సేన్ సాగర్ వద్దకు చేరుకుంటున్నారు. ఎంఎంటీఎస్‌లో వచ్చే వారు సైతం ఖైరతాబాద్ స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఈజీగా హుస్సేన్ సాగర్ చేరుకునేందుకు... మెట్రో, ఎంఎంటీఎస్‌ను కనెక్ట్ చేస్తూ ఐమాక్స్ మీదుగా అటు నెక్లెస్ రోడ్డు.. ఇటు ఎన్టీఆర్ పార్కు నుంచి సాగర్ చుట్టూ స్కైవాక్ నిర్మించాలని భావిస్తున్నారు.మొత్తం 10 కిలోమీటర్ల పైనే ఈ స్కైవాక్ నిర్మించనున్నారు. రహదారి పక్కనుంచి అవసరమైన చోట సాగర్‌లో స్తంభాలు ఏర్పాటు చేసి వాటిపై స్కైవాక్ నిర్మించనున్నారు.

## కెటిఆర్ మాటకు ఎడమ సమ్మిరెడ్డి తూటా!



"లొట్ట పీసు" చెట్టు అంటే ఇదే.. తెలంగాణాలో ముఖ్యంగా వరంగల్ జిల్లాలో "సలేంద్ర చెట్టు" అని పిలుస్తారు. "ఇపోమియా కార్నియా"గా ఇంగ్లీషులో వ్యవహరించే ఈ లొట్ట పీసు చెట్టును రబ్బర్ చెట్టుగా కూడా ఇంకొందరు వ్యవహరిస్తారు. ఓ పట్టాన ఈ చెట్టు చావదు. ఒక్కసారి మొలిచిందంటే దీన్ని చంపడం చాలా కష్టం. దహనం చేసినా కూడా చావదు. ఏ మాత్రం అవశేషం ఉన్నా మళ్ళీ మొలకెత్తుతుంది. నీళ్ళు లేని భూమిలో కూడా ఇది బతుకుతుంది. ఈ చెట్టు కర్ర లోపలి భాగం మొత్తం బూర.. లోన ఏమీ ఉండదు. కానీ చావదు.. ఫార్ములా ఈ రేసు వ్యవహారంలో ఏసీబీ నమోదు చేసిన కేసును ఉద్దేశించి అదో "లొట్ట పీసు" కేసు.. అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానిస్తున్న నేపథ్యంలో ఈ చెట్టు వార్తల్లోకి వచ్చింది.

## ప్రపంచం మెచ్చిన ఏకైక నాయకుడు మోడీ

**(1వపేజీ తరువాయి)**అభివృద్ధి పనులు ఏకకాలంలో ప్రారంభం కావడం తన జీవితంలో ఎప్పుడూ చూడలేదని చెప్పారు. విశాఖ ప్రజల చిరకాల వాంఛ అయిన రైల్వే జోన్ కల నెరవేరిందన్నారు. ఇకపై విజయాలే తప్ప అపజయాలు ఉండవన్నారు. ఏపీలో ఎన్డీఏ కూటమి 93 శాతం స్ట్రైక్ రేట్‌తో ఘన విజయం సాధించిందని తెలిపారు. భవిష్యత్తులోనూ ఈ కాంబినేషన్ కొనసాగుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు. దేశ రాజకీయాల్లో మోడీ ప్రధానిగా ఉంటారన్నారు. ఢిల్లీ ఎన్నికల్లోనూ ఎన్డీఏ గెలుస్తుందని జోస్యం చెప్పారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు మోడీ కృషి చేస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సంస్కరణలు, సుపరిపాలన మోడీ నినాదాలని చంద్రబాబు వివరించారు. దేశాన్ని బలమైన ఆర్థిక శక్తిగా మార్చేందుకు మేకిన్ ఇండియా తెచ్చారన్నారు. స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, గతిశక్తి తీసుకొచ్చారని చెప్పారు. దేశానికి ఆర్థిక రాజధానిగా ముంబై ఎలా ఉందో.. ఏపీకి విశాఖపట్నం ఆర్థిక నగరమని అన్నారు.

## సర్కార్ గేమ్ చేంజర్

**(1వపేజీ తరువాయి)**అనుమతి ఉండదని ఖరాఖండీగా చెప్పిన విషయం తెలిసిందే. రీసెంట్‌గా సినీ పెద్దల సమక్షంలో కూడా ఆయన ఇదే విషయాన్ని చెప్పినట్లుగా వార్తలు వచ్చాయి. అయితే బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వలేదు కానీ.. 'గేమ్ చేంజర్'కు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ అయితే చెప్పింది. 'గేమ్ చేంజర్' టికెట్ల రేట్ల పెంపుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తూ.. సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నారు.
'గేమ్ చేంజర్' సినిమాకు జనవరి 10వ తేదీ ఒక్కరోజు ఉదయం 4 గంటల నుంచి 6 షోలకు అనుమతిని ఇచ్చిన ప్రభుత్వం, జనవరి 11 నుంచి జనవరి 19వ తేదీ వరకు 9 రోజుల పాటు 5 షోలకు అనుమతి ఇచ్చింది. జనవరి 10 తేదీన నిర్వహించే 6 షోలకు టికెట్ల ధరలను పెంచుకునే వెసులుబాటును కల్పించింది. ఆ ఒక్క రోజు మల్టీప్లెక్స్ థియేటర్లలో రూ. 150, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ. 100 పెంచుకునేందుకు అనుమతి జారీ చేసింది. జనవరి 11 నుండి జనవరి 19 వరకు 9 రోజుల పాటు సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ. 50, మల్టీప్లెక్స్ థియేటర్లలో రూ. 100 రూపాయలు పెంచుకునేలా వెసులు బాటుని కల్పించిన ప్రభుత్వం.. ఎటువంటి బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వలేదు. ఈ సినిమా ప్రదర్శితమయ్యే థియేటర్లలో నార్కోటిక్, డ్రగ్స్ మరియు సైబర్ క్రైమ్ వంటి వాటిపై అవగాహన కల్పించే ప్రయత్నాలు చేయాలని ఆర్డర్స్ జారీ చేసింది.

## మే 1 నుంచి ఉద్యోగాలకు నోటిఫికేషన్లు

**(1వపేజీ తరువాయి)**ఆస్కారమే లేదన్నారు. ' వీటితో పాటు ఈవో పరీక్షా ఫలితాలు కూడా ఇవ్వబోతున్నామని ఆయన ప్రకటించారు. మరోవైపు, జనవరి 11, 12 తేదీల్లో బెంగళూరులో పబ్లిక్ సర్వీస్ కమిషన్ల సదస్సు ఉంటుందని, ఉద్యోగ పరీక్షల విధానాలపై సదస్సులో చర్చించనున్నట్లు ఛైర్మన్ వెంకటేశం తెలిపారు. గ్రూప్ 3 కీ విడుదల తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ బుధవారం గ్రూప్-3 పరీక్ష ప్రాథమిక కీని విడుదల చేసింది. అభ్యర్థుల వ్యక్తిగత లాగిన్లలో ప్రాథమిక కీ అందుబాటులో ఉంటుందని తెలిపింది. జనవరి 12 వరకు గ్రూప్ 3 ప్రాథమిక కీ అందుబాటులో ఉండనున్నట్లు టీజీపీఎస్సీ పేర్కొంది. ఏవైనా సందేహాలు ఉంటే జనవరి 12న సాయంత్రం 5 వరకు స్వీకరిస్తామని తెలిపింది. అభ్యంతరాలను ఇంగ్లీష్‌లో తెలపాలని టీజీపీఎస్సీ వెల్లడించింది. ఇక, మరో రెండు రోజుల్లో గ్రూప్-2 పరీక్ష ప్రాథమిక 'కీ' విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేశామని కూడా వెల్లడించింది.

## జనంలోకి జగన్



**(1వపేజీ తరువాయి)**మమేకం అయ్యేలా జగన్ ప్లాన్ ఫిక్స్ అయింది. జిల్లాలోని పార్టీ పరిస్థితులు.. గత ఎన్నికల వేళ కేడర్ తో వచ్చిన గ్యాప్ భర్తీ చేసుకొనేలా జగన్ తన టూర్ షెడ్యూల్ ఫైనల్ చేస్తున్నారు. అదే సమయంలో రెండు రోజులు పూర్తిగా నియోజకవర్గాల వారీగా లీడర్లు - కేడర్‌తో మమేకం అవ్వటంతో తిరిగి పార్టీలో జోష్ నింపాలని భావిస్తున్నారు. ప్రజల్లోనే ఉండేలా ప్రతీ వారం రెండు నుంచి మూడు రోజులు జిల్లాల పర్యటనల్లోనే ఉండేందుకు జగన్ సిద్ధం అయ్యారు. అయితే, ఫిబ్రవరి నెలాఖరులో బడ్జెట్ సమావేశాలు ఉండనున్నాయి. ఈ సమావేశాలకు హాజరవుతారా లేదా అనేది ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. మొత్తం 26 జిల్లాల్లోనూ సమీక్షలు పూర్తయిన తరువాత.. ఇక, ప్రజల్లోకి వెళ్లేలా కార్యాచరణ ఉంటుందని జగన్ స్పష్టం చేసారు. ముందుగా కేడర్ కు అండగా ఉంటూ.. స్థానిక అంశాలు, ప్రభుత్వ వైఫల్యాల పైన జిల్లాల వారీగా కార్యక్రమాలు సిద్దం చేసుకోవాలని జగన్ పార్టీ నేతలకు సూచిస్తున్నారు. కూటమి ప్రభుత్వం పైన ఇప్పటికే జనంలో ఉన్న స్పందన గురించి జగన్ పార్టీ నేతలకు వివరిస్తున్నారు.

## మద్యం ప్రియులకు షాక్..

**(1వపేజీ తరువాయి)**తీవ్రంగా నష్టపోతుందన్నారు. ఈ కారణంగా టీజీబీసీఎల్‌కి బీర్లను సరఫరా చేయడం సాధ్యం కాదని, ఇక నుంచి బీర్ల సరఫరా నిలిపివేస్తున్నట్లు యూబీఎల్ తన లేఖలో స్పష్టం చేసింది. తమ సమస్యలను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని యూబీఎల్ విజ్ఞప్తి చేసింది.

# స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారుస్తా

**(1వపేజీ తరువాయి)**ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి ఎల్లవేళలా సహకరిస్తామన్నారు. 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్‌గా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యంగా పెట్టుకున్నామని విశాఖలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. స్వర్ణ ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు లక్ష్యం: మోదీ దేశ అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యపాత్ర పోషించడమే కాదు ఇక్కడి ప్రజలు కూడా కొత్త అభివృద్ధికి సిద్ధంగా ఉన్నారని ఏపీలో ప్రగతి పరుగులు తీస్తుందని చెప్పారు. 2047 నాటికి 2.5 ట్రిలియన్ డాలర్ల లక్ష్యాన్ని సాధించడానికి, స్వర్ణ ఆంధ్రప్రదేశ్ చేరుకోవడానికి కేంద్రం లోని ఎన్డీఏ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పని చేస్తుందని అన్నారు. చంద్రబాబుతో కలిసి లక్ష్యాలను సాధిస్తాం 60 ఏళ్ల విరామం తర్వాత దేశంలో మూడవసారి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని చెప్పిన మోదీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇదే ఏపీలో తన తొలి అధికారిక కార్యక్రమమని వెల్లడించారు. ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ఇచ్చిన అద్భుతమైన స్వాగతం తనను అమితంగా ఆకట్టుకుందని మోదీ తెలిపారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ప్రతి మాటను గౌరవిస్తానని, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు తాను భరోసా ఇస్తున్నానని, కలిసికట్టుగా చంద్రబాబు లక్ష్యాలను సాధిస్తామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. చంద్రబాబుకు ప్రధాని మోదీ కితాబు దేశ అభివృద్ధిలో ఏపీ కీలక పాత్ర పోషించడమే కాకుండా అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందన్నారు. దేశానికి ఆంధ్రప్రదేశ్ స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనితీరును ప్రశంసించారు. చంద్రబాబు ప్రతి మాటలో అభివృద్ధి, సంకల్ప స్ఫూర్తి ప్రతిబింబిస్తుందని ప్రధాని మోదీ తెలిపారు. ఏపీ అభివృద్ధి తమ విజన్ అని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ 2047 నాటికి దాదాపు 2.5 ట్రిలియన్ డాలర్లు సంపాదించాలని లక్ష్యంగా పెట్టుకుందని ప్రధాని మోదీ వెల్లడించారు.
ఏపీకి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నాం ఏపీ ప్రతి లక్ష్యంలో ఎన్డీఏ ప్రభుత్వం భుజం భుజం కలిపి పని చేస్తుందని, లక్షల కోట్ల పథకాలను ఇచ్చి ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక ప్రాధాన్యతను ఇస్తున్నామని తెలిపారు. తాము కొత్తగా ప్రారంభిస్తున్న ఈ ప్రాజెక్టులతో ఏపీ అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతుందన్నారు. ఏపీ ఐటీ, టెక్నాలజీకి కేంద్రంగా ఉందని, నూతన భవిష్యత్తు సాంకేతికతలకు ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా మారాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. విశాఖ అగ్రశ్రేణి నగరంగా మారుతుంది గ్రీన్ హైడ్రోజన్ అభివృద్ధి చెందుతున్న క్షేత్రమని ఏపీని కొనియాడారు. ప్రపంచంలోని అతి కొద్ది నగరాలలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేసే సదుపాయం ఉన్న అగ్రశ్రేణి నగరంగా విశాఖపట్నం నిలుస్తుందని అన్నారు. దీని వల్ల అనేక మందికి ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. అంతకు ముందు విశాఖపట్నంలో దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయానికి ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. దీంతో రాష్ట్ర దీర్ఘకాలిక డిమాండ్ ను నెరవేర్చినట్లు అయింది. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన ప్రధాని మోదీ అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం, పూడిమడకలో గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ - గ్రీన్ హైడ్రోజన్ హబ్‌కు కూడా నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో 19 వేల 500 కోట్ల రూపాయల విలువైన రోడ్డు, రైల్వే ప్రాజెక్టులను కూడా ప్రధానమంత్రి ప్రారంభించారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో బల్క్ డ్రగ్స్ పార్కుకు శంకుస్థాపన చేశారు.

## బీఆర్ఎస్‌కు కొత్త అధ్యక్షుడు

**(1వపేజీ తరువాయి)**చూసుకుంటానని కేటీఆర్ చెప్పుకొచ్చారు. ఇది పెద్ద విషయం కాదన్నారు. సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేస్తానని తెలిపారు. ఈ రేసులో ఒక్క పైసా కూడా అవినీతి జరగలేదని చెప్పుకొచ్చారు. పార్టీ శ్రేణులు రైతు, ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఇదే సమయంలో పార్టీ నిర్మాణం.. కమిటీల ఏర్పాటు గురించి కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేసారు. కొత్త అధ్యక్షుడిగా ఈ ఏడాది పార్టీకి అధ్యక్షుడిని ఎన్నుకుంటామని కేటీఆర్ వెల్లడించారు. అయితే, ప్రస్తుత రాజకీయ పరిణామాల వేళ కేసీఆర్ తిరిగి అధ్యక్షుడిగా కొనసాగుతారా.. మరో ఆలోచన చేస్తారా అనేది పార్టీలో చర్చగా మారింది. కేటీఆర్ కు పార్టీ పగ్గాలు అప్పగిస్తారనే చర్చ..అదే విధంగా బీసీకి ఇస్తారనే వాదన మధ్య కేసీఆర్ నిర్ణయం కీలకంగా మారుతోంది. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో కేసీఆర్ తానే అధ్యక్షుడిగా కొనసాగుతారని పార్టీలో మరి కొందరు చెబుతున్నారు. ఈ ఎన్నిక గురించి పార్టీ నేతల కు కేటీఆర్ దిశా నిర్దేశం చేసారు. 2025లో బీఆర్ఎస్‌కు కొత్త కమిటీలు పూర్తి చేస్తామన్నారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి కమిటీలు నియమిస్తామని చెప్పారు. కేటీఆర్ కు అండగా తెలంగాణ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్‌ను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డైవర్షన్ లు తప్ప రేవంత్ రెడ్డి చేసింది ఏమి లేదని హరీష్ విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసమే రైతు భరోసా వేస్తారని ఆరోపించారు. అధికారంలోకి రాగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెన్షన్‌లు పెంచిందని గుర్తు చేసారు. ఎవరు ప్రశ్నిస్తే వాళ్ళ మీద కేసులు పెట్టి అణిచివేసే ప్రయత్నం చేస్తున్నారు అంటూ ముఖ్యమంత్రిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లగచర్ల రైతులకు అండగా కేటీఆర్ నిలబడ్డారని.. కేటీఆర్ ఉద్యమకారుడు, కార్యకర్తే అని తెలిపారు. కేటీఆర్ కు కష్టం వస్తే బీఆర్ఎస్ పార్టీ కుటుంబం అంతా అండగా నిలబడుతుందని హరీష్‌రావు వెల్లడించారు.

## తిరుమలలో తొక్కిసలాట


**(1వపేజీ తరువాయి)**ఉదయం తిరుపతిలో ఏర్పాటు చేసిన తొమ్మిది కేంద్రాలలో 94 కౌంటర్ల ద్వారా వైకుంఠ ద్వారా సర్వ దర్శనం టోకెన్లు ఇస్తారని భావించి ముందు రోజే క్యూ కట్టేశారు. దీంతో తోపులాట జరగడంతో ముగ్గురు మహిళలతో పాటు ఆరుగురు మరణించారని తెలుస్తోంది. ఇక ఈ ఘటనలో అనేక మందికి తీవ్రంగా గాయాలు అయ్యాయి. వీరి సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. గాయపడిన వారిని తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి కలెక్టర్ టీటీడీ ఈవో చేరుకుని పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్నారు. అసలు ఈ ఘటన ఎలా జరిగింది అంటే భక్తులు రోడ్ల మీద గుమి గూడకుండా భైరాగి పట్టెడ వద్ద పద్మావతి పార్కులో ఉంచారు. అయితే టోకెన్ల జారీ కేంద్రంలో సిబ్బంది ఒకరు అస్వస్తతకు గురి కావడంతో ఆయన కోసం క్యూ లైన్ తెరచారు. అక్కడ పెద్దగా సెక్యూరిటీ లేకపోవడం వల్ల పూర్తి స్థాయిలో తొక్కిసలాట జరిగింది. నిజానికి టోకెన్లు ఇస్తారు అని భావించి ఒక్కసారిగా భక్తులు ముందుకు దూకడంతో ఈ ప్రమాదం సంభవించింది.
తిరుపతి ఘటనపై మోడీ దిగ్భ్రాంతి తొక్కిసలాటకు కారణం చెప్పిన టీటీడీ ఛైర్మన్ తిరుపతిలో బుధవారం రాత్రి జరిగిన తొక్కిసలాట ఘటనలో ఆరుగురు భక్తులు మృతి చెందడంపై ప్రధాని నరేంద్ర మోడీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తిరుపతిలో ఇలా జరగడం బాధాకరమన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు ప్రధాని మోడీ తెలిపారు. బాధితులకు ఏపీ ప్రభుత్వం అన్ని విధాలుగా సాయం అందిస్తోందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. తొక్కిసలాట జరగడానికి కారణం అదే వైకుంఠ ద్వార సర్వదర్శనం టోకెన్ల జారీ నేపథ్యంలో తిరుపతిలో జరిగిన తోపులాటపై టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు స్పందించారు. తిరుపతిలో ఇలాంటి ఘటన ఎప్పుడూ జరగలేదన్నారు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారని, ఈ సందర్భంగా అధికారుల తీరుపై సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు.

నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

3 హైదరాబాద్ గురువారం 09 । జనవరి । 2025


## హెచ్ఎంపీవీ వైరస్.. రైల్వేస్టేషన్లు, ఎయిర్‌పోర్టుల స్క్రీనింగ్..!



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో హెచ్ఎంపీవీ కేసులు పెరుగుతున్నాయి. ఇప్పటి వరకు వైరస్ ఏడుగురికి పాజిటివ్‌గా తేలింది. కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాల వద్ద పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేసింది. దేశంలో హెచ్ఎంపీవీ ఇన్ఫెక్షన్ పెరుగుదల నేపథ్యంలో సివిల్ సర్జన్లందరికీ ఒక సలహా జారీ చేసినట్లు హర్యానా ఆరోగ్య మంత్రి ఆర్తీ సింగ్‌రావు తెలిపారు. హర్యానాలో ఇప్పటివరకు ఒక్క హెచ్ఎంపీవీ కేసు రికార్డవలేదని.. అయితే, ఆరోగ్య శాఖ అప్రమత్తంగా ఉండాలని



ప్రభుత్వం ఆదేశించిందన్నారు. హెచ్ఎంపీవీ ముప్పు నేపథ్యంలో ప్రభుత్వాలు నిఘాను పెంచాయి. రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలతో పాటు రద్దీగా ఉండే ప్రాంతాల్లో స్క్రీన్ చేస్తున్నారు. దగ్గు, జలుబుతో ఆసుపత్రులకు వచ్చే రోగులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. వాటిని స్క్రీన్ చేయడంతో పాటు పలు రాష్ట్రాల్లో రోగులను ఉంచేందుకు ఐసోలేషన్ వార్డులను సైతం సిద్ధం చేస్తున్నారు. హ్యూమన్ మెటాప్ న్యూమో వైరస్ శ్వాసకోశ వ్యవస్థలో సమస్యలను కలిగిస్తుంది. రోగనిరోధక వ్యవస్థ బలంగా లేని వ్యక్తులకు ప్రమాదకరం. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తుల్లో ఎక్కువగా వ్యాప్తి చెందేందుకు అవకాశం ఉంది.

## లైంగిక దాడిపై సీఎం స్టాలిన్ వ్యాఖ్యలు దురదృష్టకరం : బీజేపీ నేత సుధాకర్‌రెడ్డి



**న్యూఢిల్లీ-నవభూమి:** అన్నా యూనివర్సిటీ లో లైంగిక దాడి ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అసెంబ్లీ వేదికగా చేసిన వ్యాఖ్యలను అక్కడి బీజేపీ తప్పుపట్టింది. అసెంబ్లీలో సీఎం స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని తమిళనాడు బీజేపీ సహ ఇన్‌చార్జి సుధాకర్ రెడ్డి వ్యాఖ్యానించారు. నిందితుడు డీఎంకే సభ్యుడు కాదని, కేవలం డీఎంకే సానుభూతిపరుడు మాత్రమేనని సీఎం స్టాలిన్ చెప్పడం దారుణమని అన్నారు. అన్నా యూనివర్సిటీలో విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు డీఎంకే సభ్యుడు కాదని, కేవలం డీఎంకే సానుభూతిపరుడు మాత్రమేనని సీఎం ఎలా చెప్పగలిగారని సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. నిందితుడు డీఎంకే సానుభూతిపరుడు కాబట్టే తాము ఘటనపై సీబీఐ దర్యాప్తు కోసం డిమాండ్ చేస్తున్నామని ఆయన చెప్పారు. ఘటనపై సీబీఐతో దర్యాప్తు చేయిస్తే అంతా సవ్యంగా ఉంటుందని అన్నారు. అన్నా యూనివర్సిటీ ఘటనపై ముఖ్యమంత్రి స్టాలిన్ నైతిక బాధ్యతతో స్పందిస్తారని తాము ఆశించామని, కానీ ఆయన స్పందన అందుకు విరుద్ధంగా ఉన్నదని సుధాకర్‌రెడ్డి విమర్శించారు. అన్నా వర్సిటీ అంశంపై సరిగా స్పందించకపోగా గవర్నర్‌పై విమర్శలకు దిగి.. అసలు విషయాన్ని మరుగున పడేసే ప్రయత్నం చేశారని ఆరోపించారు. తాము లైంగిక దాడిపై సీబీఐ దర్యాప్తునకు డిమాండ్ చేస్తున్నామని, లేదంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని అన్నారు.

## ఢిల్లీ సీఎం బంగ్లా వద్దకు మీడియాతో వెళ్లిన ఆప్ నేతలు.. అడ్డుకున్న పోలీసులు



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీలోని సీఎం బంగ్లా వద్ద హైడ్రామా నెలకొన్నది. అరవింద్ కేజ్రీవాల్ సీఎంగా ఉన్నప్పుడు షీష్ మహల్ ఆధునీకరణంలో భాగంగా టాయిలెట్‌లో గోల్డెన్ కమోడ్, స్విమ్మింగ్ పూల్, మినీ బార్ వంటివి ఏర్పాటు చేసుకున్నారని బీజేపీ ఆరోపించింది. ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆప్ దీనిని ఖండించింది. ఈ నేపథ్యంలో బుధవారం రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్, ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ మీడియాతో కలిసి ఆ బంగ్లా వద్దకు వెళ్లారు. బీజేపీ ఆరోపణలు తప్పని నిరూపించేందుకు, 6 ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్‌లోని బంగ్లాలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. అయితే అక్కడ భారీగా మోహరించిన పోలీసులు ఆప్ నేతలను అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో వారు అక్కడ బైఠాయించి నిరసన తెలిపారు. కాగా, ఈ సందర్భంగా ఆప్ నేతలు సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్ బీజేపీపై మండిపడ్డారు. ఆ పార్టీ అబద్ధాలు బయటపడ్డాయని అన్నారు. 'సీఎం నివాసంలో బంగారు మరుగుదొడ్డి, స్విమ్మింగ్ పూల్, మినీ బార్ ఉన్నాయంటూ బీజేపీ నేతలు కొన్ని నెలలుగా గోల చేస్తున్నారు. ఇవాళ మీడియాతో పాటు ఇక్కడకు వచ్చాం. బీజేపీ నేతలు కూడా రావాలని కోరాం. వారు చెప్పిన బంగారు మరుగుదొడ్లు, స్విమ్మింగ్ పూల్ ఎక్కడ ఉన్నాయో చూడాలనుకున్నాం. అయితే పోలీసులు, వాటర్ ఫిరంగులను మోహరించారు. లోనికి అనుమతిస్తే అసలు నిజం బయటపడేది' అని అన్నారు. మరోవైపు ప్రధాని మోదీ అధికార నివాసం 'రాజ్ మహల్' అని ఆప్ నేతలు విమర్శించారు. దీని కోసం రూ.2,700 కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. దమ్ముంటే ప్రజా ధనంతో నిర్మించిన ప్రధాని లగ్జరీ హౌస్‌లోకి మీడియాను అనుమతించాలని బీజేపీకి సవాల్ చేశారు. ఆప్ నేతలు సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్ ఆ తర్వాత ప్రధాని నివాసం వైపు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు.

## నాలాగే మత్తుకు, మద్యానికి దూరంగా ఉండండి : నటుడు జాన్ అబ్రహం



**ముంబై - నవభూమి:** మద్యం మాదకద్రవ్యాలు మనిషి బతుకును ఛిద్రం చేస్తాయని, కాబట్టి వాటికి సాధ్యమైనంత దూరంగా ఉండాలని నటుడు జాన్ అబ్రహం సూచించారు. ఇవాళ డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నవీ ముంబై లో 'నషా ముక్త్ నవీ ముంబై పేరుతో జరిగిన యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లో ఆయన మాట్లాడారు. తాను తన జీవితంలో డ్రగ్స్‌ను ముట్టుకోలేదని, పొగ తాగడం, మద్యం తాగడం లాంటి అలవాట్లు కూడా లేవని జాన్ అబ్రహం చెప్పారు. అందరూ తమ జీవితంలో చాలా క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. మీ సహచరులకు, యువతకు మీరు ఆదర్శప్రాయులుగా ఉండాలని అన్నారు. 'నేను నా జీవింలో డ్రగ్స్ ముట్టుకోలేదు. పొగ తాగడం, మద్యం తాగడం లాంటి అలవాట్లు కూడా లేవు. జీవితంలో చాలా క్రమశిక్షణతో ఉండండి. మీ సహచరులకు, యువతకు ఆదర్శంగా జీవించండి' అని జాన్ అబ్రహం కార్యక్రమంలో పాల్గొన్న వారికి సూచించారు. ప్రతి ఒక్కరూ మంచి పౌరులుగా జీవించాలని, అప్పుడు సమాజం ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతుందని జాన్ అబ్రహం చెప్పారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ.. జాన్ అబ్రహంను కొనియాడారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండటంవల్లే జాన్ అబ్రహం ఇంత కూల్‌గా ఉండగలుగుతున్నాడని అన్నారు. సైబర్ సేఫ్ నవీ ముంబై అధికారుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## వణికిపోయిన టిబెట్.. 24 గంటల్లో 20 సార్లు కంపించిన భూమి

**టిబెట్ -నవభూమి:** టిబెట్ ను భారీ భూకంపం వణికించిన విషయం తెలిసిందే. టిబెట్-నేపాల్ సరిహద్దుల్లో మంగళవారం ఉదయం భారీ భూకంపం సంభవించింది. ఈ దుర్ఘటనలో 100 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. వందలాది మంది గాయపడ్డారు. నేపాల్, భారత్ సహా చైనాలోనూ భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. అనేక ఇళ్లు నేలమట్టమయ్యాయి.

# కొత్త రంగంలో అడుగు పెట్టిన గౌతమ్ అదాని



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ పారిశ్రామిక దిగ్గజం గౌతమ్ అదానీకి చెందిన గ్రూప్ సంస్థలు.. విప్లవాత్మక నిర్ణయాన్ని తీసుకున్నాయి. తమ వ్యాపార కార్యకలాపాలను మరింత విస్తరింపజేసుకున్నాయి. ఈ క్రమంలో అంతర్జాతీయ స్థాయిలో పెట్రోకెమికల్స్ రంగంలోకి అడుగు పెట్టాయి. ఇందులో భాగంగా థాయ్‌లాండ్‌కు చెందిన ఇండోరమ రిసోర్సెస్ లిమిటెడ్‌తో భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నాయి. అదాని గ్రూప్‌కు చెందిన అదానీ పెట్రోకెమికల్స్ లిమిటెడ్ ఈ మేరకు ఇండోరమ రిసోర్సెస్‌తో జాయింట్ వెంచర్‌గా ఆవిర్భవించింది. ఇండోరమ రిసోర్సెస్ జాయింట్ వెంచర్ కంపెనీ వాలర్ పెట్రోకెమికల్స్ లిమిటెడ్‌తో విలీన ప్రక్రియను పూర్తి చేసుకున్నట్లు అదానీ ఎంటర్‌ప్రైజెస్ వెల్లడించింది. ఈ మేరకు స్టాక్ ఎక్స్ఛేంజ్ సమాచారాన్ని ఇచ్చింది. ఈ జాయింట్ వెంచర్‌లో అదానీ పెట్రోకెమికల్స్- ఇండోరమ మొత్తం 50 శాతం వాటాలను కలిగి ఉంటాయి. రిఫైనరీ, పెట్రోకెమికల్, కెమికల్ రంగంలో అడుగుపెట్టాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. దీర్ఘకాలంలో రిఫైనరీలు, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌లు, స్పెషాలిటీ కెమికల్ యూనిట్లు, హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయడానికి ఇది ఉపయోగపడుతుందని పేర్కొంది. గుజరాత్‌లో కొత్త పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌లో నాలుగు బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడి పెట్టాలని భావిస్తున్నట్లు గౌతమ్ అదానీ 2022లోనే వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ మొదటి దశలో భాగంగా రెండు మిలియన్ టన్నుల ఉత్పాదక సామర్థ్యంతో పాలీ వినైల్ క్లోరైడ్ ప్లాంట్‌ను నిర్మించనున్నారు. 2026 నాటికి తొలిదశ నిర్మాణం పూర్తి చేసుకోనుందీ ప్లాంట్. ఆ మరుసటి ఏడాది నాటికి అంటే- 2027కు ఉత్పత్తి మొదలు కావడం ఖాయంగా కనిపిస్తోంది. నిజానికి- అదానీ గ్రూప్ ఆర్థిక మోసానికి పాల్పడిందని హిండెన్‌బర్గ్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో ఈ పీవీసీ ప్లాంట్ నిర్మాణంలో కొంత జాప్యం ఏర్పడింది. ఈ ఆరోపణలను అదానీ గ్రూప్ కొట్టిపారేసింది. పీవీసీ ప్లాంట్‌తో పాటు, అదానీ పెట్రోకెమికల్స్ సంస్థ.. గుజరాత్‌లోని ముంద్రాలో పెట్రోకెమికల్ హబ్‌ను సైతం నిర్మిస్తోంది. ఈ భారీ ప్రాజెక్ట్ పెట్టుబడి అంచనా దాదాపు 35,000 కోట్ల రూపాయలు. ఇది పూర్తయిన తరువాత దేశంలో అతిపెద్ద పీవీసీ తయారీ యూనిట్‌గా ఆవిర్భవిస్తుంది. అలాగే- అదానీ గ్రూప్ జర్మన్ కెమికల్ దిగ్గజం బీఏఎస్ఎఫ్‌తో కలిసి ముంద్రాలో కెమికల్ ఫ్యాక్టరీని స్థాపించింది. ఈ భాగస్వామ్యం గురించి పూర్తి వివరాలు ఇంకా అందాల్సి ఉంది.

## ఇంతమంది అక్రమ సంబంధాలు పెట్టుకుంటున్నారా..?



**న్యూఢిల్లీ-నవభూమి:** దాంపత్య జీవితం లో అసంతృప్తి ఉంటే ఆ దంపతులను వివాహేతర సంబంధాల వైపు నడిపిస్తుంది. వివాహం తర్వాత సంతృప్తికరమైన అనుబంధం లేకపోవడం, ఆకర్షణ తగ్గిపోవడం వంటి కారణాలతో వ్యక్తులు కొత్త సంబంధాల కోసం వెతుకుతారు. దాంపత్య జీవితం పట్ల నిరాసక్తత, విసుగు వున్నప్పుడు వివాహేతర సంబంధాల పట్ల ఆకర్షితులను చేస్తుంది. ప్రస్తుతం ఈ వివాహేతర సంబంధాలు చాలా సులభంగా పెరిగిపోతున్నాయి. పాశ్చాత్య సంస్కృతి ప్రభావం కూడా ఇందుకు ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు. దంపతులు వైవాహిక జీవితానికి సరైన గౌరవం ఇవ్వకపోవడం, సంస్కృతిని పక్కనపెట్టడం కూడా ఇందుకు కారణమౌతుంది. భారతదేశంలో వివాహేతర సంబంధాలు పెరుగుతున్నాయి. నగరాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో వివాహేతర సంబంధాలు తక్కువగా ఉంటాయని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. కొన్ని ముఖ్యమైన కారణాలను ఇక్కడ చర్చిద్దాం: ఆర్థిక సమస్యలు ఆర్థిక సమస్యలు, ఖర్చులు పెరగడం వలన దాంపత్య జీవితం ఒత్తిడికి గురవుతుంది. ఆర్థిక భారంతో వ్యక్తులు మానసికంగా, శారీరకంగా దూరమవుతారు. ఆర్థికంగా ఆందోళనలతో ఉన్న వ్యక్తులు బయట ఆనందం కోసం వివాహేతర సంబంధాలను పెట్టుకోవడం ప్రారంభిస్తారు. సోషల్ మీడియా ప్రస్తుత ఆధునిక యుగంలో సోషల్ మీడియా, డేటింగ్ యాప్స్ విస్తరణ కారణంగా కొత్త పరిచయాలు సులభంగా ఏర్పడుతున్నాయి. సోషల్ మీడియా వ్యక్తులకు ప్రైవేసీ అవకాశాలను మరింత పెంచుతున్నాయ్. ఆన్‌లైన్ లో పరిచయాలు, చాటింగ్, వీడియో కాల్స్ ద్వారా వ్యక్తులు సులభంగా సంబంధాలు ఏర్పరుచుకోవడం చేస్తున్నారు. సంస్కృతి మారడం ఆధునిక సమాజంలో సాంస్కృతిక మార్పులతో వ్యక్తుల ఆలోచన విధానాలు, అభిరుచులు మారుతున్నాయి. మహిళల ఆర్థిక స్వాతంత్ర్యం పెరగడం, సమాజంలో స్వేచ్ఛా భావం పెరగడం వలన వివాహేతర సంబంధాలను కొంతమంది సాధారణంగా తీసుకుంటున్నారు. సాంప్రదాయక ఆంక్షలు తగ్గి, వ్యక్తులు స్వేచ్ఛగా ఆలోచించే పరిస్థితి ఏర్పడ్డం వల్ల వివాహేతర సంబంధాలు పెరుగుతున్నా యని నిపుణులు చెబుతున్నారు. శారీరక, మానసిక అవసరాలు దాంపత్య జీవితంలో శారీరక, మానసిక అవసరాలు తీరకపోవడం కూడా వివాహేతర సంబంధాలకు కారణం అవుతుంది. ఎమోషనల్ కనెక్షన్ లేకపోవడం, శారీరక సంతృప్తి కోసం వ్యక్తులు వివాహేతర సంబంధాలను ఆశ్రయిస్తారు. ఇది కూడా వివాహేతర సంబంధానికి కరణమౌతుందని అంటున్నారు. కొత్తదనం, సాహసవాంఛ కొత్త వ్యక్తులతో సంబంధాలను ఏర్పరచుకోవడం, ఒకే వ్యక్తితో సుదీర్ఘంగా ఉండటం వలన వచ్చే విసుగు, కొత్తదనం కోసం ఆరాటపడ్డం ద్వారా వివాహేతర సంబంధాలను పెట్టుకుంటున్నారు. దాంపత్యంలో ప్రేమ తగ్గి కేవలం శారీరక సుఖం కోసం మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడం వల్ల వివాహేతర సంబంధాలను పెరిగిపోతున్నాయ్. భర్త, భార్యల మధ్య నమ్మకం లేకపోవడం దాంపత్య జీవితంలో విశ్వాసం, స్నేహం లేకపోవడం వలన ఒకరి పై మరొకరు అనుమానం పెరగుతుంది. ఆ అనుమానాలు నిజమై వివాహేతర సంబంధాలకు దారితీస్తాయి. విశ్వాసం లోపించడం వ్యక్తులను వివాహేతర సంబంధాల వైపు నడిపిస్తుంది. భార్యాభర్తల మధ్య అభిరుచులు, ఆసక్తులు విభిన్నంగా ఉండటం వలన విభేదాలు, దూరం పెరుగుతుంది. ఈ విభేదాలు ఇతర వ్యక్తుల పట్ల ఆకర్షణ పెరగడానికి కారణం అవుతాయి. సంబంధాలలో బద్ధకము కొన్నిసార్లు దాంపత్య జీవితంలో వచ్చిన బద్ధకము కూడా వివాహేతర సంబంధాలకు కారణం అవుతుంది. ఒకే రకమైన దైనందిన జీవితంలో ఆసక్తి కోల్పోవడం, కొత్త అనుభవాలు కోసం ఇతర సంబంధాలను ఆశ్రయిస్తున్నారు. పాత సంబంధాలలో ప్రేమ, ఆకర్షణ తగ్గిపోవడం వలన, ఇతర సంబంధాలు ఆకర్షణీయంగా అనిపిస్తాయి. మానసిక సంతృప్తి కోసం వ్యక్తులు వివాహేతర సంబంధాలను ఏర్పరచుకోవడం జరుగుతుంది. వివాహేతర సంబంధాలు పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయి. వ్యక్తిగత, సామాజిక, ఆర్థిక, సాంకేతిక మార్పులు దీనికి ప్రధాన కారణాలు. ఈ కారణాలను అర్థం చేసుకోవడం, సరైన చర్యలు తీసుకోవడం ద్వారా వివాహేతర సంబంధాల నుండి దూరంగా ఉండవచ్చు.

## తక్కువ తెలివి ఉంటే మహిళకు తల్లయ్యే హక్కు లేదా..? : బాంబే హైకోర్టు



**న్యూఢిల్లీ-నవభూమి:** తన కుమార్తెకు తెలివి తక్కువగా ఉన్నదని, కాబట్టి ఆమెకు గర్భస్రావం చేయించేందుకు అనుమతి ఇవ్వాలని ఓ తండ్రి వేసిన పిటిషన్‌పై బాంబే హైకోర్టు విచారణ జరిపింది. ఈ సందర్భంగా తెలివి తక్కువగా ఉన్నంత మాత్రాన మహిళలకు తల్లయ్యే హక్కు లేదా..? అని ప్రశ్నించింది. తెలివి తక్కువగా ఉన్న మహిళలు పిల్లలను కనకూడదని చెప్పడం చట్ట విరుద్ధమని వ్యాఖ్యానించింది. వివరాల్లోకి వెళ్తే.. ఓ 27 ఏళ్ల గర్భిణి తండ్రి తన కుమార్తె అబార్షన్ చేయించేందుకు అనుమతి ఇవ్వాలని బాంబే హైకోర్టును ఆశ్రయించాడు. తన బిడ్డ తెలివి తక్కువదని, పైగా ఆమెకు పెళ్లి కాలేదని అందుకు కారణాలుగా చూపించాడు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఆర్‌వీ ఘూగే, జస్టిస్ రాజేశ్ పాటిల్‌లతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. గర్భిణి మానసిక ఆరోగ్య పరిస్థితికి సంబంధించి ముంబైలోని జేజే ఆస్పత్రిలో మెడికల్ బోర్డు సమక్షంలో పరీక్షలు చేయించాలని, జనవరి 8 నాటికి సంబంధిత నివేదికను కోర్టుకు సమర్పించాలని ఇటీవల ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు ఇవాళ మెడికల్ బోర్డు.. బాంబే హైకోర్టు డివిజన్ బెంచ్‌కు నివేదికను సమర్పించింది. గర్భిణి మానసిక స్థితి సరిగానే ఉన్నదని, కాకపోతే ఆమె ఇంటెలిజెన్స్ స్థాయి 75 %ుు% తో సగటు ఇంటెలిజెన్స్ కంటే తక్కువగా ఉన్నదని తెలిపింది. ప్రస్తుతం మహిళ గర్భంలో పిండం వయసు 21 వారాలని, గర్భస్రావం చేయడానికి వీలు పడుతుందని పేర్కొన్నది. మెడికల్ బోర్డు నివేదికను పరిశీలించిన హైకోర్టు ధర్మాసనం.. గర్భిణి మానసిక స్థితి సరిగానే ఉందని నిర్ధారణకు వచ్చింది. కేవలం ఆమె ఐక్యూ స్థాయిలు తక్కువగా ఉన్నాయని పేర్కొంది. ఐక్యూ తక్కువగా ఉందనే కారణంతో ఆమెకు తల్లయ్యే హక్కు లేదనడం చట్ట విరుద్ధమని వ్యాఖ్యానించింది. తను గర్భం దాల్చడానికి కారణం ఎవరో కూడా ఆమె చెబుతున్నందున ఆమె తల్లిదండ్రులు అతడితో మాట్లాడి పెళ్లికి ఒప్పించాలని సూచించింది. గర్భిణి, ఆమె గర్భానికి కారణమైన వ్యక్తి ఇద్దరూ మేజర్లే కావడం, పైగా తాను ఇష్టపూర్వకంగానే అతడితో రిలేషన్‌లో ఉన్నానని గర్భిణి చెబుతున్నందున దాన్ని నేరంగా పరిగణించలేమని కోర్టు స్పష్టంచేసింది. నిందితుడు గర్భిణిని వివాహం చేసుకునేందుకు ఒప్పుకోకపోతే చట్టం ప్రకారం చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది. కేసు తదుపరి విచారణను జనవరి 13కు వాయిదా వేసింది.

## క్యాబ్ దిగి రూ.500 ఇచ్చిన ప్రయాణికుడు.. నోటు చూసి అవాక్కైన ఉబెర్ డ్రైవర్



**న్యూఢిల్లీ-నవభూమి:** ఓ క్యాబ్‌లో ప్రయాణించిన ప్రయాణికుడు ఇచ్చిన నోటుతో ఆ ఉబెర్ డ్రైవర్ షాక్ అయ్యాడు. ఎందుకంటే అతడు ఇచ్చింది నకిలీ నోటు. అయితే అది నకిలీ నోటు అని ఆ ప్రయాణికుడు కూడా గుర్తించకపోవడం గమనార్హం. చివరికి ఆ నోటు నకిలీదే అని గుర్తించగా.. అది మార్చేసి డ్రైవర్‌కు మరో నోటు ఇచ్చాడు. అయితే ఈ వ్యవహారం మొత్తాన్ని ఆ ప్రయాణికుడు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది ఇప్పుడు తెగ వైరల్ అవుతోంది. దీంతో ఆ పోస్ట్‌కు నెటిజన్లు రకరకాల కామెంట్లు పెడుతున్నారు.

హర్యానాలోని గుర్గావ్‌లో జరిగిన ఓ సంఘటన ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద రచ్చ లేపుతోంది. ఓ వ్యక్తి తనకు ఎదురైన అనుభవాన్ని సోషల్ మీడియాలో పంచుకోవడంతో అది ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గుర్గావ్‌లోని గ్రామీణ ప్రాంతాల్లో పర్యటించేందుకు వెళ్లిన ఓ వ్యక్తి.. ఉబెర్ క్యాబ్ బుక్ చేసుకున్నాడు. తాను దిగాల్సిన చోటు రాగానే అక్కడ దిగేశాడు. అయితే జేబులో నుంచి రూ.500 నోటు తీసి.. డ్రైవర్‌కు ఇచ్చాడు. ఇక ఆ నోటును చూసిన డ్రైవర్‌కు ఏదో అనుమానం వచ్చింది. ఆ నోటును పూర్తిగా పరిశీలించగా.. అది నకిలీ నోటు అని తేలింది. వెంటనే ఆ విషయాన్ని ఆ ప్రయాణికుడికి చెప్పడంతో దాన్ని మార్చి ఇచ్చాడు. అయితే తాను ఏటీఎం మెషీన్ నుంచే ఆ నోటును తీసినట్లు వెల్లడించాడు. ఇప్పుడు ఈ వ్యవహారం తీవ్ర చర్చకు దారి తీసింది. అయితే ఈ విషయాన్ని సోషల్ మీడియాలో షేర్ చేసిన ఆ ప్రయాణికుడు.. మొదట తాను దాన్ని నమ్మలేకపోయానని ఆ తర్వాత గుర్తించినట్లు చెప్పాడు. దాని మీద మనోరంజన్ బ్యాంక్ అని ఉందని పేర్కొన్నాడు. ఫుల్ ఆఫ్ ఫన్ అని కూడా రాసి ఉందని తెలిపాడు. ఇక ఆ నోటును ఏటీఎం నుంచే తీశానని 90 శాతం కచ్చితంగా చెప్పలగలనని వెల్లడించాడు. అయితే మిగిలిన 10 శాతం మాత్రం ఏటీఎం మెషీన్ అలాంటి తప్పు చేసి ఉండదని తాను నమ్ముతున్నట్లు చెప్పాడు. ఇక ఈ సోషల్ మీడియా పోస్ట్ వైరల్ కావడంతో నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. కొందరు ఆ ఉబెర్ డ్రైవర్ తీరును తప్పుపట్టారు. తన వద్ద ఉన్న ఫేక్ నోటును మార్చేసి.. ఆ ప్రయాణికుడి వద్ద మరో రూ.500 కాజేయాలని పెద్ద స్కామ్ చేశాడని పేర్కొంటున్నారు. అయితే మరో వ్యక్తి మాత్రం ఇది కచ్చితంగా డ్రైవర్ పనే అయి ఉంటుందని.. ఎందుకంటే ముంబైలో తన బంధువుకు కూడా ఇలాంటిదే జరిగిందని.. అప్పుడు రూ.2 వేల నోటును ఇలాగే చేశారని తెలిపాడు. ఇది 101 శాతం కచ్చితంగా ఏటీఎం నుంచి వచ్చిన నోటు కాదని.. మనుషులు తప్పులు చేస్తారు కానీ.. మెషీన్ తప్పు చేయదని మరో నెటిజన్ కామెంట్ చేశాడు. మరికొందరు ఆ పర్యాటకుడిపై సానుభూతి కల్పించారు. ఈ విషయంలో చాలా అంత కష్టపడాల్సిన అవసరం లేదని.. ఇప్పటినుంచైనా ఇలాంటివి గమనించండని సూచించాడు. ఇక నకిలీ నోటును ఆ ప్రయాణికుడు గమనించకుండా ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు. ఇక ఆ నోటు ఇప్పటికే అతని వద్ద ఉంటే.. అది నిజం అయిందో లేదో తెలుసుకోలేదా అని అన్నారు. ఇక మరికొందరు "వెల్‌కమ్ ఇండియా.. ఇక్కడ స్కామ్‌లు కూడా చాలా క్రియేటివ్‌గా ఉంటాయి" అని పేర్కొన్నాడు. ఇప్పటి నుంచి ఏదైనా కరెన్సీ నోటు తీసుకుంటే అది నకిలీదా.. నిజమైందా చూసి తీసుకోవాలని ఇంకొందరు నెటిజన్లు సూచిస్తున్నారు.

## ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో.. ఆప్‌కు టీఎంసీ మద్దతు




**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల వేడి రగులుతున్నది. అక్కడ అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కు తృణమూల్ కాంగ్రెస్ (ఆప్ అధినేత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ఢిల్లీ ఎన్నికల్లో ఆప్‌కు మద్దతిచ్చిన టీఎంసీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆమె ఎప్పుడూ కూడా ఆప్‌కు మద్దతుగా ఉన్నారని కొనియాడారు. అరవింద్ కేజ్రీవాల్ మేరకు బుధవారం ఎక్స్‌లో ఒక పోస్ట్ చేశారు. 'ఢిల్లీ ఎన్నికల్లో ఆప్‌కు టీఎంసీ మద్దతు ప్రకటించింది. మమతా దీదీకి నేను వ్యక్తిగతంగా కృతజ్ఞతలు తెలుపుతున్నా. ధన్యవాదాలు దీదీ. మా మంచి, చెడు సమయాల్లో మీరు ఎల్లప్పుడూ మాకు మద్దతు ఇచ్చారు. మమల్ని ఆశీర్వదించారు' అని పేర్కొన్నారు. కాగా, ప్రతిపక్ష కూటమి 'ఇండియా' బ్లాక్‌లో భాగమైన ఆప్‌కు ఇప్పటికే సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), శివసేన (యూబీటీ) కూడా మద్దతిచ్చాయి. అయితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేసిన ఆప్ ఈసారి ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయించింది. మరోవైపు 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు 67, 62 స్థానాలతో ఆప్ క్లీన్ స్వీప్ చేసింది. హ్యాట్రిక్ విక్టరీతో మూడోసారి అధికారంలోకి రావాలని ఆ పార్టీ భావిస్తున్నది. 70 మంది సభ్యులున్న ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగనున్నది. ఫిబ్రవరి 8న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు.

## భార్యను చంపి మృతదేహాన్ని దాచిన భర్త.. ఆమె స్నేహితుడి హత్యకు ప్లాన్, పోలీసులు అరెస్ట్

**న్యూఢిల్లీ-నవభూమి:** ఒక వ్యక్తి అనుమానంతో భార్యను చంపాడు. శరీరాన్ని ముక్కలుగా నరికి పడేసేందుకు మృతదేహాన్ని దాచాడు. భార్య స్నేహితుడ్ని కూడా హత్య చేసేందుకు ప్లాన్ చేశాడు. అయితే దీనికి ముందే పోలీసులు ఆ వ్యక్తిని అరెస్ట్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. 26 ఏళ్ల దీపికా చౌహాన్ స్పాలో పనిచేస్తున్నది. ఆమె భర్త ధనరాజ్ బైక్ ట్యాక్సీ రైడర్. మద్యానికి బానిసైన అతడు తన సంపాదనను వ్యసనానికి ఖర్చు చేసేవాడు. దీంతో భార్య దీపిక తన సంపాదనతో ఇంటిని నడుపుతున్నది. కాగా, భార్య స్నేహితుడితో ఆమెకు వివాహేతర సంబంధం ఉందని ధనరాజ్ అనుమానించాడు. ఈ నేపథ్యంలో డిసెంబర్ 29న దీపికను హత్య చేశాడు. శరీరాన్ని ముక్కలుగా నరికి పడేసేందుకు మృతదేహాన్ని బెడ్ బాక్స్‌లో దాచాడు. ఆ తర్వాత అమృత్‌సర్ పారిపోయాడు.

## సినీ నటి హనీరోజ్‌కు లైంగిక వేధింపులు.. కేరళలో ప్రముఖ వ్యాపారి అరెస్ట్



సినిమా నటి హనీ రోజ్ ని లైంగికంగా వేధించిన కేసులో కేరళ కు చెందిన ప్రముఖ నగల వ్యాపారి బాబీ చెమ్మనూర్ అరెస్టయ్యారు.

నటి ఫిర్యాదు అనంతరం కేరళ సర్కారు ఏర్పాటు చేసిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ బుధవారం మధ్యాహ్నం బాబీ చెమ్మనూర్‌ను కస్టడీలోకి తీసుకుంది. హనీరోజ్ ఫిర్యాదు మేరకు కేరళ పోలీసులు ఆయనపై నాన్ బెయిలబుల్ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. ఇవాళ వాయనాడ్‌లో ఆయనను అరెస్ట్ చేశారు. వ్యాపారి చెమ్మనూర్ అరెస్టుపై నటి హనీరోజ్ స్పందించారు. ఇది తనకు ఎంతో ప్రశాంతమైన రోజని అన్నారు. తాను ఈ విషయాన్ని సీఎం పినరయి విజయన్ దృష్టికి తీసుకెళ్లగానే వ్యాపారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. 2012లో వచ్చిన త్రివేండ్రమ్ లాడ్జి సినిమాతో మంచి గుర్తింపు సంపాదించిన హనీరోజ్.. ఇలాంటి మతిలేని మనుషుల గురించి తాను పెద్దగా పట్టించుకోనని, అయితే చెమ్మనూర్ మళ్లీమళ్లీ లైంగికంగా వేధించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశానని చెప్పారు. నాలుగు నెలల క్రితం ఆయన తనపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తెలిపారు. దాంతో తన కుటుంబం అంతా ఆవేదన చెందినదని చెప్పారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in





## ఆ పేరుకు కళంకం తేవడం నాకు ఇష్టం లేదు : తమిళనాడు సీఎం

**న్యూఢిల్లీ-నవభూమి:** అన్నా యూనివర్సిటీలో విద్యార్థినిపై లైంగిక దాడి జరిగిన ఘటనపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అసెంబ్లీ వేదికగా స్పందించారు. ఈ అంశాన్ని అడ్డంపెట్టుకుని కొందరు సభ్యులు మాటిమాటికి అన్నా యూనివర్సిటీ పేరు ప్రస్తావించడాన్ని ఆయన తప్పుపట్టారు. యూనివర్సిటీలో విద్యార్థినిపై జరిగిన దారుణం ఎవరికీ ఆమోదయోగ్యం కాదని, అది దారుణమని వ్యాఖ్యానించారు.'సభలో చాలామంది సభ్యులు ఒక యూనివర్సిటీ పేరును ప్రస్తావిస్తూ మాట్లాడుతున్నారు. కానీ నేను ఆ యూనివర్సిటీ పేరును ప్రస్తావించదల్చుకోలేదు. నేను ఆ పేరుకు కళంకం తేవాలనుకోవడం లేదు. ఎందుకంటే ఈ సభలో ఉన్నవారిలో చాలామందిని తయారు చేసింది ఆయనే. ఆ భావోద్వేగంతో నేను ఆ పేరును పక్కన పెడుతున్నా. చెన్నైలో విద్యార్థినిపై జరిగిన ఘటనను ఎవరూ ఆమోదించరు. విద్యార్థినిపై లైంగిక దాడి కరమైన చర్య' అని స్టాలిన్ వ్యాఖ్యానించారు.'సభలోని సభ్యులంతా లైంగిక దాడి ఘటనపై మాట్లాడారు. ఒక్కరు తప్ప మిగతా అందరూ నిజమైన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని చెడుగా చూపించడమే ఆ ఒక్క సభ్యుడి పని. కానీ నేను ఒక్కటే చెబుతున్నా. మా ప్రభుత్వం బాధితురాలికి న్యాయం జరిగే వరకు అండగా ఉంటుంది. నేరం జరిగిన తర్వాత నిందితుడిని అరెస్ట్ చేయకపోయినా, అతడిని కాపాడే ప్రయత్నాలు జరిగినా ప్రభుత్వాన్ని నిందించవచ్చు. నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసినా, వేగంగా విచారణ చేయిస్తున్నా ప్రభుత్వాన్ని నిందించడమనేది రాజకీయ ప్రయోజనాల కోసమే' అని స్టాలిన్ ఆరోపించారు.



## పాక్-అఫ్ఘాన్ వైరం!

అఫ్ఘానిస్థాన్‌మీద పాకిస్థాన్ వైమానికదాడులు జరిపి అనేకమంది ప్రాణాలు తీయడం గర్హనీయమని, ఖండిస్తున్నామని భారతదేశ విదేశాంగశాఖ ప్రతినిధి సోమవారం వ్యాఖ్యానించారు. ఎంతోమంది మహిళలు, పిల్లలు మరణించారంటూ ఘాటుగా విమర్శించడమే కాక, తన చేతగానితనానికి పొరుగుదేశాలను ఆడిపోసుకోవడం పాకిస్థాన్‌కు అలవాటేనని అన్నారాయన. దాదాపు పదిరోజుల క్రితం అఫ్ఘానిస్థాన్‌లోని తెహ్రీక్ఎ-తాలిబాన్ పాకిస్థాన్ (టీటీపీ) స్థావరాలమీద పాకిస్థాన్ యుద్ధవిమానాలు బాంబులు కురిపించడంతో నలభైఆరుమంది మరణించిన విషయం తెలిసిందే. దీనికి ప్రతీకారం తీర్చుకుంటానని ప్రకటించిన తాలిబాన్ మరో నాలుగురోజుల్లోనే పాకిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో దాడులు జరిపింది. ఈ వరుస దాడుల్లో మంచిచెడ్డలను అటుంచితే, అఫ్ఘానిస్థాన్ పక్షాన పాకిస్థాన్‌ను భారతదేశం గట్టిగా తప్పుబట్టడం మారుతున్న రాజకీయానికీ, హెచ్చుతున్న సాన్నిహిత్యానికీ నిదర్శనం.ల్లో రెండువైపులా పెద్దసంఖ్యలో సైన్యాలు మోహరించివున్నాయని వార్తలు వస్తున్నాయి. తెహ్రీక్ తాలిబాన్‌మీద పాకిస్థాన్ వైమానికదాడులు చేయడం ఇది రెండోసారి. గత ఏడాది మార్చిలో కంటే ఇప్పుడు దాడులమీద తాలిబాన్ మరింత తీవ్రంగా స్పందించింది, ప్రతీకారం కూడా తీర్చుకుంది. అమెరికా అర్థంతరంగా అఫ్ఘానిస్థాన్‌ను వదిలేసి, తట్టాబుట్టా సర్దేసిన కొద్దిగంటల్లోనే, ఆ దేశం తాలిబాన్ల వశమైన విషయం తెలిసిందే. వారిని ఎదిరించలేక, అమెరికా శిక్షణ పొందిన అఫ్ఘాన్‌సైనికులు, పోలీసులు పరుగులు తీసిన దృశ్యాలు చూశాం. తాలిబాన్ల పునరాగమనంతో అఫ్ఘాన్లు వొణికిపోయారు. వందలాదిమంది దేశం విడిచిపోయారు. యావత్ ప్రపంచం తాలిబాన్ రాకకు భయపడుతూంటే, పాకిస్థాన్ మాత్రం ఎగిరిగంతేసింది. అమెరికా తనమాట విని దేశాన్ని తాలిబాన్‌కు వదిలేసినందుకు సంతోషించింది. అల్లా దయతోనే ఇదంతా జరిగిందన్నారు ఇమ్రాన్‌ఖాన్. అధికారాన్ని కైవసం చేసుకోవడానికి మార్గాన్ని సుగమంచేసిన తనపట్ల తాలిబాన్ విధేయంగా ఉంటుందని పాకిస్థాన్ పాలకులు భ్రమపడ్డారు. కానీ, అనతికాలంలోనే ఉభయుల మధ్యా వ్యవహారం పూర్తిగా చెడింది. గత అవతారానికి కాస్తంత భిన్నంగా, స్వతంత్రంగా వ్యవహరిస్తున్న తాలిబాన్ ఈ మారు పాకిస్థాన్ ఆదేశాలను, ఆలోచనలను లక్ష్యపెట్టలేదు.ఇక, తాలిబాన్ ఆశీస్సులతోనే టీటీపీ తనపై ఇంతగా రెచ్చిపోతున్నదన్న పాకిస్థాన్ వాదన కాదనలేనిది. తాలిబాన్ మధ్యవర్తిత్వంతో 2021లో ఇమ్రాన్ ప్రభుత్వం టీటీపీతో చర్చలు జరిపింది. అవి ఫలితానివ్వకపోవడంతో పాటు, అమెరికా వదిలిపోయిన చాలా ఆయుధాలు ఈ సంస్థ చేతుల్లో పడటంతో అది మరింత బలోపేతమైంది. టీటీపీ విషయంలో పాకిస్థాన్ ఎప్పటికప్పుడు తాలిబాన్‌ను హెచ్చరించినప్పటికీ ఫలితం లేకపోయింది. టీటీపీని నియంత్రించిన పక్షంలో అందులోని సాయుధులంతా ఐసిస్‌వంటి సంస్థల్లో చేరిపోయి తన ఉనికికే ప్రమాదం తేవచ్చునని తాలిబాన్ భయం. ఇతర ఉగ్రసంస్థలను నిలువరించడానికి తాలిబాన్‌కు టీటీపీతో స్నేహం ఉపకరిస్తోంది. టీటీపీని పెంచిపోషిస్తున్నందుకు పాకిస్థాన్ తీవ్రంగా మండిపడుతున్నప్పటికీ తాలిబాన్ లక్ష్యపెట్టడం లేదు. పాకిస్థాన్ సరిహద్దుప్రాంతాలతో అది సాగిస్తున్న విధ్వంసానికి తాలిబాన్ పరోక్షంగా సాయపడుతున్నది కూడా. ఒకపక్క టీటీపీ, మరోపక్క బలూచ్, పష్తూన్ తిరుగుబాటుదారుల విధ్వంసకాం డలతో పాకిస్థాన్ నలిగిపోతోంది. చైనా, సౌదీ పెట్టుబడులకు భద్రతకల్పించలేని స్థితికి అది జారుకుంది. తాలిబాన్‌తో నేరుగా యుద్ధానికి దిగి గెలిచేస్థితిలో పాకిస్థాన్ లేదు. కానీ, ఇలా అడపాదడపా సరిహద్దుల్లోకి చొరబడి, ఏవో కొన్ని దాడులు జరుపుతూ ఉగ్రవాదంమీద యుద్ధం చేస్తున్నట్టుగా ప్రజలను సమాధానపరచే ప్రయత్నమైతే పాక్ పాలకులు చేస్తున్నారు. పాకిస్థాన్‌లో ఉంటున్న లక్షలాదిమంది అఫ్ఘాన్లను వెళ్ళగొట్టిన ఘటన ఉభయదేశాల మధ్యా మరింత దూరం పెంచింది. ఒకవైపు పాకిస్థాన్‌తో సంబంధాలు ఇలా పతనమైపోతూంటే, మరోపక్క అఫ్ఘాన్-భారత్ సాన్నిహిత్యం పెరుగుతోంది. ఇటీవలే భారతదేశంలో అఫ్ఘానిస్తాన్ రాయబారిగా యువవిద్యార్థి ఇక్రముద్దీన్ కమిల్ నియమితుడైనాడు. పాక్‌ప్రేరేపిత ఉగ్రవాదసంస్థలను తన భూభాగంలో అనుమతించకుండా, భారతదేశానికి వ్యతిరేకంగా వ్యవహరించకుండా తాలిబాన్ ఉన్నంతకాలం ఈ స్నేహం కొనసాగుతుంది. పాకిస్థాన్‌ను తల ఎగరేయకుండా సరిహద్దుల్లో ఉంచేందుకు తాలిబాన్‌తో స్నేహం ఉపకరిస్తుంది.

# పేదోళ్ళ ప్లీడర్ శంకరన్న



శ్రీకాకుళం నుండి సిరిసిల్ల దాకా తెలుగునేలపై వెల్లువెత్తిన విప్లవోద్యమాల్లోని ప్రజాస్వామి కాంశాలను గుర్తించి సమర్ధించిన వాళ్లలో జస్టిస్ కృష్ణయ్యర్ నుండి డిసెంబర్ 1, 2024న అసువులు బాసిన చల్లా శంకర్ వరకు ఎందరో న్యాయ కోవిదులు ఉన్నారు. రాజ్యాంగ హక్కుల అమలుపైన ఉన్నత న్యాయస్థానాల్లో పోరాడుతూ పేరెన్నికగన్న ఎంతోమంది న్యాయవాదుల కన్నా, ఆ రాజ్యాంగ హక్కుల అమలు తీరును ప్రశ్నిస్తూ, అనునిత్యం రాజ్యం బెదిరింపులను తట్టుకుంటూ విచారణ కోర్టుల్లో పనిచేయడం కత్తి పైన సాము లాంటిదే. ఈ కృషిలో ఉద్యమ ప్రత్యక్ష కేంద్రమైన ఖమ్మం పట్టణంలో ఉంటూ ఒక పాత లూనాపై తిరుగుతూ ప్రజలపైన మోపిన అక్రమ కేసులను న్యాయపరంగా సవాల్ చేస్తూ, చివరకు తానే అక్రమ కేసులను ఎదుర్కొంటూ నిలబడాల్సి రావడం మామూలు విషయం కాదు. 1974లోనే తొలితరం పీడీఎస్‌యూ విద్యార్థిగా ప్రారంభమై, అత్యవసర పరిస్థితి నిర్బంధంలోనూ, తదనంతరం ప్రజాస్వామిక విప్లవ విజృంభణలోనూ, గోదావరిలోయ విప్లవోద్యమంతో పెనవేసుకుని జనశక్తి విప్లవ రాజకీయాల వకల్తాదారుగా, కోర్టుల్లో ప్రజాకార్యకర్తల న్యాయ సహాయకుడిగా పనిచేసిన కొద్దిమంది వ్యక్తుల్లో చల్లా శంకర్ ఒకరు. ప్రజా న్యాయవాదులుగా, ప్రజాస్వామిక హక్కుల కార్యకర్తలుగా పేరుగాంచిన బొజ్జతారకం, బాలగోపాల్, పొల్సాని విఠల్‌రావు, కన్నాబిరన్, పత్తిపాటి వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి లాంటి ఎందరో అమర న్యాయవాదులకు చల్లా శంకర్ ఏ మాత్రం తక్కువ కాదు.

చల్లా శంకర్ తండ్రి చల్లా వెంకటయ్య బట్టలు కుట్టి బతికే వృత్తి చేస్తూనే తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న యోధుడు. తల్లి రాజమ్మ ఇల్లాలుగా ఐదుగురు పిల్లల్ని పెంచి, ఇంటికి వచ్చిన ఉద్యమకారులకు విసుగులేకుండా భోజనాలు పెట్టే ప్రేమాస్పదురాలు. 1969 ఏప్రిల్ 16న చంద్ర పుల్లారెడ్డి నాయకత్వాన సాగిన పగిడేరు ప్రతిఘటనతో ఖమ్మం జిల్లాలో పురుడుబోసుకున్న విప్లవోద్యమం శంకరన్నను పీడీఎస్‌యూ కార్యకర్తగా, హేతువాదిగా, ప్రజాన్యాయవాదిగా, హక్కుల కార్యకర్తగా తీర్చిదిద్దాయి. వారసత్వంగా వచ్చిన 70 గజాల ఇల్లును అటు న్యాయవాద వృత్తికి, ఇటు ప్రజాసంఘాల విప్లవ కార్యక్రమాలకు కేంద్రంగా మార్చినాడు. తను హక్కుల కార్యకర్తగా అడవి, ఊరు, పట్టణం అనే తేడా లేకుండా కలియతిరిగినాడు. న్యాయవాద విద్యనభ్యసించి తొలి అమరుడిగా ప్రసిద్ధిగాంచిన బత్తుల వెంకటేశ్వరరావును ఆదర్శంగా తీసుకున్నాడు. అమరుడు కొండన్న నుండి పగిడేరు లక్ష్మక్క దాకా ఎందరినో కలిశాడు. కొండపల్లి సీతారామయ్య, కూర రాజన్నల నుండి చిన్న రాజన్న దాకా ఎందరికో న్యాయ సేవలందించినాడు. ఈ కార్యకలాపాల్లో రూపుదిద్దుకున్న ఆయన వ్యక్తిత్వానికి కుటుంబం ద్వారా అందిన మానవతా పరిణామాలు అదనపు సొగసుగా ఉన్నాయి. కామ్రేడ్స్ రంగవల్లి, భరత్‌ల అమరత్వం తర్వాత పలు జాగ్రత్తలు తీసుకుని నేను ఒకసారి స్వయంగా ఆయన ఇంటికి పోవాల్సి వచ్చినా ఏ మాత్రం తొణికిసలాడ లేదు. ఈ ధైర్యం కూడా ఆయనను నిత్యం వెన్నంటి నడిపించి అతన్ని గోదావరిలోయ విప్లవోద్యమానికి దృఢమైన వకాల్తాదారుగా నిలబెట్టింది. 1978 అక్టోబర్ 20న సిరిసిల్ల, -జగిత్యాల తాలూకాలు కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించిన తర్వాత, రైతాంగ ఉద్యమాలకు సంఘీభావం కూడగట్టే క్రమంలోనే 1983 వరకు, అంటే ఐదేళ్ల కాలంలో డజనుల సార్లు అరెస్టు కావడం, అనేక కేసులు, వారాల తరబడి చిత్రహింసలెదుర్కోవడం సర్వసాధారణాంశంగా ఉండేది. ఈ క్రమంలో 1977లో కన్నా భిరాన్ నాయకత్వాన నిమ్మపల్లికి నిజనిర్ధారణ బృందం తీసుకెళ్లడం, 1978 తర్వాత బాలగోపాల్, కోదండరాంలను ఆర్థిక-సామాజిక పరిశీలన కోసం సిరిసిల్ల గ్రామాల్లో జరిపిన, పరిశోధనలకు సహకరించడం, గున్నాల్ మిర్డాల్ పర్యటన, 1982లో ప్రారంభమైన ఎన్‌కౌంటర్ హత్యల నిర్ధారణలో జార్జి ఫెర్నాండెజ్ బృందం వెంట సాగడం లాంటివి నా అనుభవంలో ఉన్నాయి. గోదావరి లోయకు గుండెకాయ లాంటి ఖమ్మంలో అతని నిత్య కార్యాచరణ, అనుభవాలు ఏమిటో రికార్డు చేయవల్సి ఉండెను. అవి భవిష్యత్తు తరాలకు అందడం అవసరం. ఒక తరం అంతరిస్తున్న కాలంలో కామ్రేడ్ చల్లా శంకర్ స్మృతిలో ఒక పుస్తకం తీసుకురావాలని చొరవ చూపిన వారందరూ అభినందనీయులు. డిసెంబర్ 22న తలపెట్టిన "పేదోళ్ళ ప్లీడర్ శంకరన్న" స్మృతులు అజరామరం కావాలి, ఆయన సంస్మరణ సభ విజయవంతం కావాలి.

# పంచ రంగులతో రూపొందించిన బౌద్ధ పంచశీల పతాకం



### శాంతి వ్యక్తి స్వేచ్ఛ సమాజ పురోభివృద్ధికి చిహ్నం

ప్రపంచ దేశాలలో ఆచరిస్తున్న బౌద్ధమతం **జనవరి 8 వ తేదీ ప్రపంచ బౌద్ధ పంచశీల పతాక దినోత్సవం..**

ప్రతి దేశానికి ఒక పతాకం ఉంటుంది.ఈ పతాకాలు ఆయా దేశాల మనోభావాలను తెలియచేస్తుంది.పతాకం అనేది ఒక దేశంలో ఉన్న జాతి ప్రజల మనోభావాలకు అద్దం పడుతుంది.ఒక దేశం లేదా రాజ్యం లేదా జాతికి గర్వకారణంగా పతాకాన్ని రూపొందించుకుంటారు. అలాగే రాజకీయ పార్టీలు కూడా తమ సిద్ధాంతాలను ప్రతిఫలించేలా పతాకాన్ని రూపొందించుకుంటారు.అదేవిధంగా ప్రతి మతం కూడా తమ మత సిద్ధాంతాలను వ్యక్తం చేసే విధంగా పతాకాన్ని రూపొందించుకుంటారు.ప్రపంచ వ్యాప్తంగా రాజకీయ పతాకాలు, మత పతాకాలు ఉన్నాయి.

బౌద్ధ ధమ్మానికి సంకేతంగా పంచశీల పతాకాన్ని రూపొందించడం జరిగింది.తథాగత బుద్ధునికి జ్ఞానోదయం అయిన సందర్భంలో ఐదు రంగులు ఒక క్రమంలో ఇంధ్ర ధనస్సులా చక్రం ఆకారంలో వెలువడినట్లు బౌద్ధులు భావిస్తారు. పంచశీల పతాకంలో కూడా ఈ ఐదు రంగులను తీసుకోవడం జరిగింది. ఐదు రంగులు ఐదు రకాల శీలాలకు సంబంధించిన సంకేతాలు.

పంచశీల పతాక నిర్మాణం :

గార్డెన్ ఎల్లో కలర్ ,ముదురు ఎరుపు ,తెలుపు,మెజంటా,ఆరెంజి రంగులు గల బట్ట ముక్కలు నిలువు నిలువగా ఉంటాయి.ఈ ఐదు రంగులతో పాటుగా పంచశీల పతాకంలో మొదట ఊదా రంగు, ఆ తరువాత బంగారు వన్నె పసుపు రంగు,దాని తరువాత ఎరుపు రంగు ,ఆ తరువాత తెలుపు రంగు ,ఆ తరువాత కాషాయ రంగు ,ఆ తరువాత ఈ ఐదు రంగులు చిన్న చిన్నవిగా ఉంటాయి.ఈ ఐదు రంగులు పవిత్రతను తెలియచేస్తాయి.ఈ ఐదు రంగులు కలిస్తే వచ్చే ఆరో రంగు తథాగత బుద్ధుని వ్యక్తిత్వానికి సంకేతంగా ఉంటుంది.ఊదా రంగు స్వాభిమానానికి ,పసుపు రంగు పవిత్రతకు,ఎరుపు రంగు జ్ఞానానికి, తెలుపు స్వచ్ఛతకు,ఆరెంజి రంగు నిష్కామ ప్రవృత్తికి సంకేతాలు.పంచశీల పతాకంలో నిలువు నిలువుగా ఉన్న ఐదు రంగులు బౌద్ధ భికు?ల ధర్మ నియమాలకు సంబంధించినవిగా ఈ ఐదు నియమాలు చెప్పబడ్డాయి.అడ్డంగా చిన్నవిగా కనబడే ఐదు రంగులు బౌద్ధ ఉపాసిక, ఉపాసకులు ,గృహస్థులు ఆచరించవలసిన పంచశీల నియమాలకు ప్రతీక.

బౌద్ధ పంచశీల పతాకాన్ని వంద సంవత్సరాలకు ముందే సింహళ శ్రీలంక దేశంలో ఒక సంఘం ఏర్పడింది. పూజనీయులైన సుమంగల పంచశీల పతాక ఏర్పాటు సంఘానికి అధ్యక్షుడు.ఈ పంచశీల పతాక ఏర్పాటు కమిటీలో పూజనీయ హిక్కాదులే,విలియం డి.అబ్రా,డాన్ కరోలిస్ హెపా వితరణ,పీటర్ డి.అబ్రయు,డాన్ అందిరిస్ పెరారా,ధర్మ గుణ వర్ధనే,ఛార్లెస్,ఎ.డిసిల్వా, యన్.యన్.ఫెర్నాండో,విలియమ్ ఫెర్నాండొ లు సభ్యులు.తొలుత పంచశీల పతాకాన్ని రూపొందించి సంఘం ముందు ఉంచిన వాళ్ళు కరోలిస్ ,పూజిత ధర్మ గుణవర్ధనేలు.ఈ సందర్భంగా పంచశీల పతాక కమిటీ ఆయా రంగులు వాటి సంకేతాలను గురించి నిశితంగా పరిశీలించారు. ఆ తరువాత బోర్డు ఈ పంచశీల పతాకానికి ఆమోద ముద్ర వేయడం జరిగింది.మొట్టమొదటి సారిగా బుద్ధ పూర్ణిమ రోజున 1885 ఏప్రిల్ 20 న సింహళ దేశంలో కొతహెన అనే ప్రదేశంలో ధర్మగుణవర్ధనే బౌద్ధ భికు?వుచే పంచశీల పతాకం ఎగురవేయించారు.యావత్ బౌద్ధ దేశాలు బౌద్ధ పంచశీల పతాకాన్ని అంగీకరించారు.1950 లోనే సింహళ దేశంలోనే జరిగిన ప్రపంచ బౌద్ధ సమ్మేళనంలో ఒక అధికారిక ప్రకటన కూడా చేశారు. ఇక ఆరోజు నుండి బౌద్ధులు తమ ఇంటి మీద ,విహార్ ల పైన ఈ పంచశీల పతాకాన్ని ఎగురవేస్తున్నారు.హెన్రీ స్టీల్ ఆల్కాట్ 2 ఆగష్టు 1832 న అమెరికాలో జన్మించాడు. అతను ఒక అమెరికన్ మిలిటరీ ఆఫీసర్, జర్నలిస్ట్, న్యాయవాది మరియు థియోసాఫికల్ సొసైటీ సహ వ్యవస్థాపకుడు మరియు మొదటి అధ్యక్షుడు. క్రైస్తవ మతాన్ని విడిచిపెట్టి బౌద్ధమతాన్ని ప్రారంభించిన మొదటి ప్రసిద్ధ అమెరికన్ ఆయన. థియోసాఫికల్ సొసైటీ అధ్యక్షుడిగా ఆయన చేసిన కార్యకలాపాలు బౌద్ధమతం యొక్క పునరుజ్జీవనానికి ఎంతో సహాయపడ్డాయి. శ్రీలంకలో బౌద్ధమతాన్ని పునరుద్ధరించడంలో ఆయనకు ఎంతో కృషి ఉంది మరియు ఈ గొప్ప కృషికి శ్రీలంకలో ఆయన ఎంతో గౌరవంగా కనిపిస్తారు.శ్రీలంక ప్రజలు కూడా వారి స్వాతంత్ర్య పోరాటంలో వీరుడిగా భావిస్తారు. రిటైర్డ్ కల్నల్ హెన్రీ స్టీల్ ఓల్కాట్ బౌద్ధ జెండాకు తండ్రి మరియు మొదటి అమెరికన్ బౌద్ధుడు. బౌద్ధ జెండా లేదా పంచశీల జెండా నిర్మాణంలో ఆయన విశేష కృషి చేశారు. ఆయన రూపొందించిన బౌద్ధ జెండా బౌద్ధ దేశాలలో ప్రపంచవ్యాప్తంగా గుర్తించబడింది మరియు అంగీకరించబడింది. ఈ జెండాను మొదట శ్రీలంకలోని కొలంబో కమిటీ 1885 వ సంవత్సరం జనవరి 8 వ తేదీన రూపొందించింది.



పంచశీల పతాకంలో రంగులను గుర్తించడం.

1. నీలం: బౌద్ధ మతంలో ప్రేమ మరియు దయ యొక్క భావనను సూచిస్తుంది.
2. పసుపు: మధ్యే మార్గాన్ని సూచిస్తుంది, అనగా, రూపం మరియు శూన్యత పూర్తిగా లేకపోవడం.
3. ఎరుపు: సాధన, జ్ఞానం, ధర్మం, అదృష్టం మరియు గౌరవాన్ని సూచిస్తుంది. 4. తెలుపు: సమయం లేదా స్థలంతో సంబంధం లేకుండా ధర్మం ఎల్లప్పుడూ ఉంటుందని స్వచ్ఛత, విముక్తిని సూచిస్తుంది.
5. ఆరెంజ్: జ్ఞానం, బలం మరియు గౌరవంతో నిండిన బౌద్ధ మతం యొక్క సారాంశం.
6. ఈ ఐదు రంగుల కలయిక ఇది ఏకైక సత్యం అని సూచిస్తుంది.

పంచసీల (పంచశీల)

1.పాణాతిపాతా వేరమణీ సికా?పదం సమాదియామి.
ప్రాణములు తీయను అనే నియమాన్ని పాటించెదను.

2.అదిన్నాదానా వేరమణి సికా?పదం సమాదియామి. చౌర్యానికి పాల్పడను అనే నియమాన్ని పాటించెదను.

3.కామేసు మిచ్చాచారా వేరమణి సికా?పదం సమాదియామి. లైంగిక దురాచారాలకు పాల్పడను అనే నియమాన్ని పాటించెదను.

4.ముసావాదా వేరమణీ సికా?పదం సమాదియామి. అబద్ధములు చెప్పకూడదు అనే నియమాన్ని పాటించెదను.

5.సురా మేరయ మజ్జ పమాదట్ఠానా వేరమణీ సికా?పదం సమాదియామి. ప్రమాదమునకు నెలవులయిన మత్తుపానీయములను త్రాగను అనే నియమాన్ని పాటించెదను.

బుద్ధ భగవానుడు బోధించిన పంచసీల ప్రపంచ ప్రజలకు ఆదర్శనీయమైనది.ధర్మం పట్ల నిజంగా నీలో ఏ మాత్రం స్పృహ ఉన్నా ఈ ఐదు సూత్రాలను పాటించాలి. ఈ ఐదు నియమాలను గనుక పాటించగలిగితే మనశ్శాంతి కలుగుతుంది. అప్రమత్తతనూ పెంపొందిస్తుంది.ప్రపంచ వ్యవహారాలలో మునిగి పోతూ తేలుతూ ఉండే ప్రజలందరికీ మన మాటలూ ,చేతలూ సరైనవిగా ఉన్నాయా లేదో ఎవరికి వారు సరిచూసుకోవడానికి పంచసీలములు అనే ఐదు నియమాలను భగవాన్ బుద్ధుడు ఉపదేశించారు.

1. మొదటి నియమం ప్రాణి హింస చేయను అంటే ప్రాణము గల ఏ జీవిని హింసించను అని.మన మాటలతో కానీ చేతలతో కానీ ఎవరినీ అకారణంగా బాధించరాదు.ఒకరిని బాధ పెడుతూ పొందే ఆనందం మనకు వద్దు.అది అసలు ఆనందమే కాదు. అలాగే మనం తినడం కోసం జంతువులను అదే పనిగా హింసించి ,చంపడం ,వాటిని తినడం కూడా ప్రాణి హింస కిందకే వస్తోంది. బౌద్ధం శాస్త్రీయమైనది కాబట్టి మారుతున్న పరిస్థితులకు అనుకూలంగా మనం మార్చుకుంటాం.ఈ మొదటి నియమాన్ని %చీశ్ ఒశీ ఖఅశ్రీశ్రీ జఖ్ ఒశీ ఖఅశ్రీశ్రీ% గా చెప్పుకోవచ్చు. అయితే ఏది ఏమైనా జీవ హింస మనసు పెట్టి గనుక ఆలోచిస్తే అది మనకే బాధను కలుగజేస్తోంది.సృష్టిలో సమస్త జీవులు చిన్నవైనా పెద్ద వైనా వాటిని బతకనివ్వాలి.కాబట్టి మొదటి నియమం క్రౌర్యాన్ని విడనాడి కరుణను అలవరుచుకుంటాను అని శిక్ష స్వీకరణం అవుతుంది.

2. రెండో నియమం దొంగతనం చేయరాదు.సమాజంలో విలాసవంతమైన జీవితం కోసం మోసం చేయడం ,దౌర్జన్యం చేసైనా దొంగతనం గా డబ్బు సంపాదించాలనే వాళ్ళు తయారు అవుతున్నారు. ఇది అన్యాయం, అక్రమ సంపాదన కోసం దొంగ తనం చేయడం కూడా నేరమే.అది మన మనసుకు తెలుస్తోంది. ఇలాంటి పనులను బౌద్ధ ఉపాసకులు చేయరాదు. సంతృప్తి జీవితాన్ని మనం అలవరుచు కోవాలి. సంతృప్తిని మించిన ఐశ్వర్యం మరొకటి ఉండదు కదా!.

బౌద్ధం లో

3.మూడవది అత్యంత ముఖ్యమైనది లైంగిక దురాచారాలకు పాల్పడను అనేది.సంసార జీవితం లో లైంగిక ప్రవర్తన ఒక భాగం.మనలో కలిగే ఏ కోరికలను అయినా బలవంతంగా అణచకూడదు.దాని వలన ఇబ్బందులు తలెత్తుతాయి తప్పితే ఆ కోరికలను జయించలేం.కోరికలు కలిగినప్పుడు విచ్చలవిడిగా ప్రవర్తించరాదు.విచ్చలవిడిగా ఎవరితో పడితే వారితో అక్రమ సంబంధాలు పెట్టుకుంటూ పోతే మన దగ్గర ఉన్న డబ్బు ,వ్యక్తిత్వం అన్నీ కోల్పోతాం.అన్నింటికన్నా ముఖ్యంగా దుకా?న్ని కొని తెచ్చుకున్న వాళ్ళం అవుతాం.ఎప్పటికీ మన మనసులో కలిగే ఈ లైంగిక పరమైన కోరికలను నిర్మూలించుకోలేం.బౌద్ధం ఎప్పుడూ మధ్యే మార్గాన్ని సూచిస్తోంది. విచ్చలవిడిగా తిరగడం వలన అనారోగ్యం పాలవడం ఖాయం.మంచి ఆరోగ్య కరమైన లైంగిక సంబంధాన్ని కలిగి ఉండటమే దీనికి పరిష్కారం.ఇది మనిషి పురోగతి కి కూడా ఉపకరిస్తుంది. సహజీవనం వలన కూడా సమస్యలు ఎక్కువ అవుతాయి. దాని వలన మనిషికి దుఖమే మిగులు తుంది.ఒకరికే మన భావాలకు దగ్గరగా ఉన్నవారికి కట్టుబడి ఉండాలి లేదా బ్రహ్మ చర్యం పాటించాలి.బ్రహ్మ చర్యం కష్టమే అలాగని పెద్ద కష్టమేమీ కాదు. బ్రహ్మ చర్యం లో ఉన్న ఆనందం ఇంకెక్కడా దొరకదు.

4. నాల్గవది అబద్ధాలు ఆడరాదు. మనం మన కళ్ళతో చూడనివి ,మనకు నిజంగా తెలియని వాటి గురించి ఊరికే నోరు ఉంది కదా అని వాగరాదు.ఈ మధ్య సోషల్ మీడియాలో మనకు నిజం తెలియకపోయినా అబద్ధాలు పోస్టులు కొందరు తమ స్వార్థం కోసం క్రియేట్ చేసి పెడుతుంటే వాటిని మతం మత్తులో షేర్ చేయడం ,పోస్టులు పెట్టి అవే నిజమని వైరల్ చేస్తోన్నారు. ఇది చాలా పెద్ద తప్పు ,నేరం కూడా. కొందరు అబద్ధాలను చాలా సులువుగా మాట్లాడేస్తారు.మనఃసాక్షి ని చంపుకుని బతికే బతుకు ఒక బతుకేనా.

5. ఐదవది మద్యం వంటి మత్తు పదార్థాలు సేవించరాదు. మద్యం సేవించడం వలన స్మృతి ని , సంప్రజన్యాన్నిపోగొడుతుంది. దీని వలన కష్టాలు తెచ్చిపెట్టుకుంటాం.మంచి జీవన విధానానికి ప్రధాన ఆటంకం మద్యం వంటి మత్తును కలిగించేవి.మానసిక సమతౌల్యాన్ని కోల్పోయేటట్లు చేసేవే మద్యం, డ్రగ్స్ వంటివి.మద్యానికి అలవాటు పడితే విచక్షణా జ్ఞానం కోల్పోతాం.మద్యం మదాన్ని కలిగిస్తుంది. తాగినవాడు ఆడతాడు ,పాడతాడు ,ఏడుస్తాడు, తెలివి తక్కువ దద్దమ్మ వలె చివరికి కోతులవలె తయారు అవుతారు.మద్యం అనారోగ్యాన్ని కలిగిస్తుంది.

( వ్యాసం సోషల్ మీడియా సేకరణ )

అస శ్రీరాములు
సీనియర్ జర్నలిస్ట్
9440037196

భక్తి

## రావయ్యా రామయ్యా.. జగదానంద కారకుడికి శుభ స్వాగతం పలుకుతున్న అయోధ్య



బాలరాముడి పాలబుగ్గలు ముద్దాడిన సౌభాగ్యనగరి అయోధ్య. కౌసల్య తనయుడి కౌశలాన్ని తొట్టతొలిగా చూసి పొంగింది అయోధ్య. చందమామను అద్దంలో చూస్తూ పాలబువ్వ తింటున్న రామచంద్రుడిని కండ్లప్పగించి చూసింది అయోధ్య. అంతేనా, బుడిబుడి అడుగుల రాముడి పాదముద్రలు మోసి పరవశించింది. వడివడి పరుగుల రాముడి వాయువేగానికి ఊగిపోయింది. మర్యాదకు మన్ననినిచ్చే దశరథ రాముణ్ని చూసి గర్వించింది. సీతమ్మ తోడుగా వచ్చిన కల్యాణరాముడికి దిష్టి తీసింది. తండ్రిమాటకై కానలకేగిన రాఘవుణ్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపించింది. లోక కంటకుడైన దశకంఠుడిని మట్టుపెట్టి వచ్చిన కోదండపాణికి హారతి పట్టింది. సహస్ర నామాల వాడిని శతవిధాలా కీర్తించే భాగ్యం దక్కించుకున్న అయోధ్య మరోసారి మురిసిపోతున్నది. భవ్యమందిరంలో బాలరాముడి దివ్యమూర్తి ప్రతిష్ఠతో%‍% జగదానంద కారకుడికి శుభ స్వాగతం పలుకుతున్నది అయోధ్య.

ఇప్పుడు పుణ్యమంతా అయోధ్యదే! యుగాలుగా వినుతికెక్కిన పుణ్యక్షేత్రం పేరు మరోసారి విశ్వ యవనికపై సువర్ణాక్షరాలతో ప్రతిష్ఠితమవుతున్నది. కల్పాంతాలకు వెరవని కల్పతరువు మరో సత్సంకల్పానికి వేదిక అవుతున్నది. ముముక్షువులు చేరి తరించాలనుకునే మోక్షనగరి.. తరలివస్తున్న రాఘవుడికి సుముహూర్తాంజలి ఘటిస్తున్నది.'ఆలము సేయుటకా.. అయోధ్య పాలన సేయుటకా ఓ రాఘవా.. ఏలావతారమెత్తుకుంటివి రాముడై' అని త్యాగరాజస్వామి కీర్తించినట్టు.. రాముడు యుద్ధం చేయడానికి పుడితే%‍% రావణ సంహారంతో అవతార లక్ష్యం పూర్తికావాలి. కానీ, రాముడు పుట్టింది 'అయోధ్య' కోసం. అయోధ్యా నగర ప్రజల కోసం. కోసల రాజ్య సౌభాగ్యం కోసం. అవనిపై మానవుడు ధర్మబద్ధంగా, న్యాయ సమ్మతంగా ఎలా నడుచుకోవాలో తెలియజేయడం కోసం.రామచంద్రుడు దశరథ మహారాజు కన్నులపంట. కౌసల్యాదేవి నోముల పంట. రాముడి రాకకోసం వీళ్లిద్దరు మాత్రమే కాదు.. అయోధ్యంతా ఎదురుచూసింది. వారందరి తపఃఫలంగా నారాయణుడు నరుడిగా అవతరించి.. అవనిని తరింపజేసిన వైనం. ధర్మ, జ్ఞాన స్వరూపమైన అయోధ్యను ఎంచుకోవడం రామలీల. తాను ఇక్కడే పుడతాననీ, రావణుడిని సంహరిస్తాననీ, ఈ ధరణిని పదకొండువేల సంవత్సరాలు పాలిస్తాననీ స్వయంగా విష్ణుమూర్తి చేసిన ప్రకటన%‍% అయోధ్యకు జాతర. రావణుడి దురహంకారానికి పాతర.అయోధ్య అంటే శత్రువులు ఎవరూ జయించలేనిది అని అర్థం. అయోధ్య అంటే.. వైకుంఠం అని తాత్విక భా... వైకుంఠనాథుడు అయోధ్యను తన జన్మభూమిగా ఎంపిక చేసుకున్నాడేమో! పవిత్రమైన సూర్యవంశంలో.. దార్శనికుడైన దశరథుడి నందనుడిగా రావాలనుకున్నాడు. పుత్రకామేష్ఠి ఫలితంగా కౌసల్య కడుపు పండింది. నిత్య వసంతంతో శోభిల్లే అయోధ్యలో నవ వసంత నవమి (చైత్ర శుద్ధ నవమి) నాడు రాజీవ లోచనుడు కన్ను తెరిచాడు. పసి రాముడి ముసిముసి నవ్వులకు సరయూ ఉప్పొంగింది. రాచవీధుల్లో వెలుగులు. పురవాడల్లో జిలుగులు. ఒక యుగం ముందే.. అయోధ్యకు దీపావళి వచ్చేసింది. నేటికీ శ్రీరామ నవమి సందర్భంగా అయోధ్యలో దీపావళి జరుగుతున్నది. సరయూ తటిపై వెలిగించిన దీపాలు.. ఆ నదీమతల్లి జల తరంగిణులపై తటిల్లతా హారాలై రామచంద్రుడికి హారతి పడతాయి. 'సియావర్ రామచంద్ కీ జై..' అని అయోధ్య అంతా రాజారాముణ్ని ఎలుగెత్తి కీర్తిస్తుంది.

## వీటిని అలాగే తింటే మేలు..!



**బీట్‌రూట్:** దీనిలో పీచుపదార్థం, ఫోలేట్లు, ఐరన్, సి విటమిన్, పొటాషియం, మాంగనీస్ అధికంగా ఉంటాయి. బీట్‌రూట్ ముక్కలను ఎక్కువ వేడిమీద ఉడికిస్తే ఈ పోషకాల్లో 25 శాతం వరకూ నష్టపోతాం. అందుకే బీట్‌రూట్ ముక్కలను సలాడ్స్‌లో కలుపుకుని తినడం, జ్యూస్ చేసుకుని తాగడం మంచిది. బీట్‌రూట్‌ని సన్నని చక్రాల్లా కోసి దానిమీద నిమ్మరసం, మిరియాలపొడి చల్లుకుని తింటే రక్తంలో హెమోగ్లోబిన్ స్థాయి పెరుగుతుంది. రక్తహీనత సమస్యలు రావు.

**కేరెట్:** దీనిలో బీటా కెరోటిన్, పీచు పదార్థం, కె విటమిన్, ఎ విటమిన్, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు, పిండిపదార్థాలు ఉంటాయి. కేరెట్‌ను ఉడికించినపుడు వీటిలో చాలావరకూ ఆవిరైపోతాయి. కేరెట్ రుచిగా ఉంటుంది కాబట్టి దానిని అలాగే తినడం ఉత్తమం. లేదంటే కేరెట్ తురుముని సలాడ్స్‌లో, మొలకల్లో కలుపుకుని తినవచ్చు. జ్యూస్ చేసుకుని తాగవచ్చు. కేరెట్‌లోని పోషకాలు కంటిచూపుని మెరుగుపరుస్తాయి. క్యాన్సర్‌ను నివారిస్తాయి.

**నిమ్మకాయ:** దీనిలో సి విటమిన్, సోడియం, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్ లాంటి పోషకాలు ఉంటాయి. నిమ్మరసాన్ని వేడి పదార్థాలకు కలిపితే ఇవన్నీ నశించిపోతాయి. అందుకే గోరువెచ్చగా ఉన్నపుడు మాత్రమే వంటకాలకు నిమ్మరసాన్ని కలపాలి.

**పచ్చి కొబ్బరి:** ఇది జీర్ణక్రియకు, గుండె ఆరోగ్యానికి తోడ్పడుతుంది. సిలీనియం, మాంగనీస్, కాపర్, జింక్ అరుదైన పోషకాలున్నాయి

# రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడానికి మెంతి నీటిని ఎలా ఉపయోగించాలి..!



మధుమేహం అనేది రక్తంలో చక్కెర స్థాయిలలో హెచ్చుతగ్గులతో గుర్తించే ఆరోగ్య పరిస్థితి. డయాబెటిస్‌లో అనేక రకాలు ఉన్నాయి: టైప్ 1 డయాబెటిస్, టైప్ 2 డయాబెటిస్, గర్భధారణ మధుమేహం, ప్రీడయాబెటిస్. వారిలో రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఎక్కువగా ఉంటే, చక్కెర పదార్థాలు, అధిక కార్బ్ ఆహారాలు డయాబెటిస్ డైట్ ప్లాన్‌లో తీసుకోవడం మంచిది కాదు. ఆహారంలో ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలి. రక్తంలో చక్కెర స్థాయిలను కంట్రోల్ చేయడానికి సహాయపడే అనేక సహజ పద్ధతుల్లో మెంతి నీరు ఒకటి. మెంతి నీటిని రోజూ తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటంటే..

**మెంతి నీరు ఎందుకు సహాయపడుతుంది?**

ఇంటర్నేషనల్ జర్నల్ ఫర్ విటమిన్ అండ్ న్యూట్రిషన్ రీసెర్చ్ ఒక అధ్యయనం, వేడి నీటిలో నానబెట్టిన 10 గ్రాముల మెంతులు రోజువారీ మోతాదులో టైప్-2 డయాబెటిస్‌ను నియంత్రించడంలో సహాయపడుతుందని కనుగొంది. మధుమేహం ఉన్నవారిలో బ్లడ్ షుగర్‌ని తగ్గించే సామర్థ్యం మెంతుల నీటికి ఉంది. ఇది ఫైబర్ కలిగి ఉంటుంది. జీర్ణక్రియ ప్రక్రియను మందగించడంలో సహాయపడుతుంది, కార్బోహైడ్రేట్లు, చక్కెరలను నియంత్రిస్తుంది.

1. మధుమేహ వ్యాధిగ్రస్తులకు మెంతి గింజలు ఉపయోగపడతాయి. ఈ విత్తనాల్లో ఫైబర్, ఇతర రసాయనాలు ఉన్నాయి, ఇవి జీర్ణక్రియను నెమ్మదిస్తాయి. కార్బోహైడ్రేట్లు, చక్కెరను శరీరం శోషణం చేస్తాయి.
2. శరీరం చక్కెరను ఎలా ఉపయోగిస్తుందో, విడుదలయ్యే ఇన్సులిన్ మొత్తాన్ని పెంచడంలో కూడా విత్తనాలు సహాయపడతాయి.
3. కొన్ని అధ్యయనాలు మెంతులు కొన్ని పరిస్థితులకు సమర్థవంతమైన చికిత్సగా చెప్పబడ్డాయి.
4. ఒక చిన్న 2009 అధ్యయనంలో వేడి నీటిలో నానబెట్టిన 10 గ్రాముల మెంతి గింజల రోజువారీ మోతాదు టైప్ 2 డయాబెటిస్‌ను నియంత్రించడంలో సహాయపడుతుందని కనుగొంది.
5. ఇతర అధ్యయనాలు మెంతికూరను సప్లిమెంట్‌గా తీసుకున్నప్పుడు గ్లూకోజ్‌లో హెచ్చుతగ్గులు కనుగొంది.

# చలి వేధిస్తోందా?



చలి కాలం చలి వేధించడం సహజమే! అయితే కొందరు కాస్త చలిని కూడా తట్టుకోలేకపోతూ ఉంటారు. తాపమానాలు ఏ కాస్త తగ్గినా చలితో బాధపడుతూ ఉంటారు. ఈ స్వభావం వెనక కొన్ని ఆసక్తికరమైన కారణాలున్నాయి. అవేంటంటే...

ఐరన్ లోపం: హిమోగ్లోబిన్ ఉత్పత్తికి అత్యంత ముఖ్యమైన ఖనిజలవణం ఐరన్. ఐరన్ లోపిస్తే, శరీరంలో కణజాలాలకు ఆక్సిజన్ సరఫరా జరగక, చేతులు, కాళ్లూ చల్లబడిపోతాయి.

థైరాయిడ్ సమస్యలు: మందకొడిగా పని చేసే థైరాయిడ్ వల్ల శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం తగ్గుతుంది. శరీరంలో వేడి జనించడానికి తోడ్పడే మెటబాలిజం కుంటుపడడంతో చలి వేధిస్తుంది.మధుమేహం, హైపర్‌టెన్షన్: మధుమేహం వల్ల రక్త ప్రసరణ బలహీనపడి చేతులు, పాదాలకు రక్త ప్రసరణ మందగిస్తుంది. ఫలితంగా చల్లదనం బాధిస్తుంది.

విటమిన్ బి12 లోపం: ఎర్ర రక్తకణాల ఉత్పత్తికీ, నాడుల పనితీరుకూ విటమిన్ బి12 కీలకం. ఈ పోషక లోపంతో, శరీరానికి అందే ఆక్సిజన్‌లో కొరత ఏర్పడి, నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. దాంతో చలి, నిస్సత్తువలు వేధిస్తాయి.

డీహైడ్రేషన్: వాతావరణ తాపమానాల క్రమబద్ధీకరణలో నీళ్లు కీలక పాత్ర పోషిస్తాయి. డీహైడ్రేషన్‌కు గురైనప్పుడు, శరీర తాపమానం నిర్వహణ క్రమం తప్పి, సాధారణంగా కంటే చలి ఎక్కువవవుతుంది. కాబట్టి సరిపడా నీళ్లు తాగుతూ ఉండాలి.

# నిద్ర లేవగానే ఇలా...



రోజంతా ఉత్సాహంగా ఉండాలంటే ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరం. దీనిని అలవరచుకోవడానికి ఉదయం వేళలు అనుకూలంగా ఉంటాయి. నిద్రలేవగానే ఏ అలవాట్లు పాటించాలో తెలుసుకుందాం!

వేడి నీళ్లు తాగాలి:

ఉదయం లేవగానే ఖాళీ కడుపుతో ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లు తాగడం మంచిది. ఇందులో రెండు చెంచాల నిమ్మరసం, ఒక చెంచా తేనె కూడా కలుపుకోవచ్చు. దీనివల్ల శరీరంలో నీటి శాతం తగ్గకుండా సమతౌల్యంలో ఉంటుంది. జీవక్రియలు సక్రమంగా జరుగుతాయి. జీర్ణ వ్యవస్థ మెరుగై శరీరమంతా పరిశుభ్రమవుతుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

యోగా చేయాలి:

పొద్దున్నే కనీసం ఇరవై నిమిషాలు యోగా చేయడం వల్ల రోజంతా ఉల్లాసంగా ఉంటుంది. సూర్య నమస్కారాలు చేసినా భుజంగాసనాలు వేసినా శరీరంలోని కండరాలు చురుకుగా మారతాయి. శరీరాన్ని సాగదీసే ఆసనాలు వేస్తే రక్తప్రసరణ వ్యవస్థ మెరుగై అవయవాలన్నీ ఆరోగ్యంగా ఉంటాయి. సులభమైన యోగాసనాలు రోజూ వేస్తూ ఉంటే శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.

నడవాలి:

పొద్దున్నే పచ్చని చెట్ల మధ్య లేదంటే ఏదైనా పార్కులో కనీసం అరగంట నడవడం వల్ల రోజంతా ఉత్సాహంగా ఉండవచ్చు. రెట్టింపు శక్తితో పనులు చేసుకోవచ్చు. కోపం, ఒత్తిడి, ఆందోళన, గుండె జబ్బులు, మధుమేహం దరిచేరవు. శరీరానికి అవసరమైన ఆక్సిజన్ అంది మెదడు చురుకుగా పనిచేస్తుంది. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి. క్రమం తప్పకుండా నడక అలవాటు చేసుకుంటే జీవక్రియలు సమన్వయంగా పనిచేసి ఊబకాయం రాకుండా చేస్తాయి.

అల్పాహారం తినాలి:


ఉదయం పూట ప్రోటీన్లతో కూడిన అల్పాహారం తీసుకోవడం మంచిది. ప్రోటీన్లు ఆకలిని నియంత్రించడమే కాకుండా శక్తిని అందిస్తాయి. గ్రీన్ టీ, గుడ్లు, ఓట్స్, పండ్లు, గింజలు, మొలకలు, సలాడ్స్, పన్నీరు, బఠానీలు, ఆవిరిమీద ఉడికించినవాటిని అల్పాహారంలో చేర్చుకోవడం వల్ల శరీరం చురుకుగా ఉంటుంది.

# అమెరికా సెనేట్‌లో విభిన్న స్వరం!



హక్కుల ఉద్యమాల నుంచీ రాజకీయాల వరకూ... సారా మెక్‌బ్రైడ్ సాగించిన ప్రయాణం ఓ సంచలనం. తాజాగా... అమెరికాలో సెనేట్‌కు ఎన్నికైన మొదటి ట్రాన్స్ జెండర్‌గా చరిత్ర సృష్టించారు. ఆ దేశ రాజకీయ చరిత్రలో కొత్త అధ్యాయానికి నాంది పలికిన సారా... విభిన్న లైంగిక వర్గాల (ఎల్‌బీజీటీక్యూ)కు సమాన హక్కులు కల్పించడమే తన లక్ష్యమంటున్నారు.

"ట్రాన్స్‌జెండర్ సెనేటర్‌గా మిగిలిపోవాలని నేను కోరుకోవడం లేదు. ప్రజలకు ఒక సెనేటర్‌గా సేవలందిస్తాను. ట్రాన్స్‌జెండర్‌ను కావడం యాదృచ్ఛికం మాత్రమే" అంటున్నారు సారా మెక్‌బ్రైడ్. అమెరికాలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో డెల్వార్ రాష్ట్రం నుంచి సెనేటర్‌గా సారా ఎన్నికకు ప్రత్యేకత ఉంది. తమను కూడా అందరితో సమానులుగా గుర్తించాలంటూ ఈక్వాలిటీ చట్టం కోసం పోరాడుతున్న విభిన్న లైంగిక వర్గాల (ఎల్‌బీజీటీక్యూ- లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్, క్వీర్ లేదా క్వశ్చనింగ్) తొలి ప్రతినిధిగా సెనేట్‌లో అడుగుపెడుతున్నారు. డెల్వార్ రాష్ట్రంలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి స్టీవ్ వాషింగ్టన్‌ను మంచి మెజారిటీతో సారా ఓడించి, ప్రపంచం దృష్టిని ఆకర్షించారు.ప్రశంసాపాత్రమైన ధైర్యం..అమెరికాలోని డెల్వార్ రాష్ట్రం విల్లింగ్టన్‌లో 1990 ఆగస్టు తొమ్మిదిన పుట్టిన సారాకు తల్లితండ్రులు పెట్టిన పేరు టిమ్. నాలుగైదేళ్ళ వయసులో తనలో అబ్బాయి లక్షణాలు లేవని సారాకి అర్థమయింది. అయితే ఆ విషయాన్ని తన ఇరవయ్యేకటో ఏట బయటపెట్టారు. మొదట తల్లితండ్రులకూ, బంధువులకూ తెలియజేశారు. అప్పటికి అమెరికన్ యూనివర్సిటీ స్టూడెంట్ అయిన సారా అక్కడ విద్యార్థి సంఘానికి ప్రెసిడెంట్ కూడా. ప్రెసిడెంట్ పదవి మరో రోజులో ముగుస్తుందనగా... కళాశాల విద్యార్థుల పత్రిక ద్వారా తనను తాను ట్రాన్స్‌జెండర్ మహిళగా ప్రకటించుకున్నారు. అది దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. అమెరికాకు అప్పటి ఉపాధ్యక్షుడు, ప్రస్తుతం ఎన్నికైన అధ్యక్షుడు జో బిడెన్‌తో సహా ఎంతోమంది సారా ధైర్యాన్ని ప్రశంసించారు. ఎంతో ఆందోళన పడ్డాను..."నేను కాని జీవితాన్ని నేను కొనసాగించలేను. అది నన్నూ, ప్రపంచాన్నీ మోసం చేసుకోవడమే. అందుకే లోకానికి నేనేమిటన్నది తెలియజెప్పాను. అప్పటివరకూ నాలో నేను చాలా సంఘర్షణ అనుభవించాను. నా నిజమైన అస్థిత్వం గురించి చెబితే నా కుటుంబం, స్నేహితులు, సమాజం ఎలా తీసుకుంటుందోన్న ఆందోళన నాకు ఉండేది. మొదట్లో నా తల్లితండ్రులు బాధపడ్డారు. తరువాత నాకు అండగా నిలిచారు" అంటారు సారా. ఆ తరువాత యూనివర్సిటీ క్యాంపస్‌లో ఎల్‌బీజీటీక్యూలపై వివక్ష పోవాలనీ, వారికి అనుకూలమైన వాతావరణం ఉండాలని పోరాడారు. దీనికి మంచి స్పందన వచ్చింది. చదువు పూర్తి చేసిన వెంటనే ఎల్‌బీజీటీక్యూ సంఘాలతో కలిసి ఉద్యమాల్లో సారా పాల్గొన్నారు. మరోవైపు శ్వేతసౌధంలో పబ్లిక్ ఎంగేజ్‌మెంట్, ఇంటర్-గవర్నమెంటల్ అఫైర్స్ విభాగంలో ట్రైనీగా పని చేశారు. ఈక్వాలిటీ డెల్వార్ బోర్డులో డైరెక్టర్‌గా చేరి, ట్రాన్స్‌జెండర్ల న్యాయపరమైన హక్కుల పరిరక్షణ కోసం పోరాడారు. ఈ హక్కులకు సంబంధించిన కీలకమైన చట్టం రాష్ట్ర సెనేట్‌లో ఆమోదం పొందడంలో కీలకపాత్ర పోషించారు. అలాగే హ్యూమన్ రైట్స్ క్యాంపెయిన్ ప్రెస్ సెక్రటరీగా తన వాణిని బలంగా వినిపించారు. విద్వేషం ఇంకా పోలేదు..."సమాజంలో అట్టడుగున ఉన్న, అణచివేతకు గురవుతున్న వర్గాల సమస్యలను పరిష్కరించి, వారి పురోగతికి ప్రయత్నిస్తే క్రమంగా మార్పు వస్తుంది. ప్రతి ఒక్కరి శ్రేయస్సుకోసం పనిచేసే ఆర్థిక వ్యవస్థ ఉండాలి. అందరికీ గృహవసతీ, విద్య, ఆరోగ్య సంరక్షణ అందుబాటులోకి వచ్చేలా చూడాలి. ముఖ్యంగా విభిన్న లైంగిక వర్గాల వారికి తగిన ఉపాధి అవకాశాలు దొరికితే సమాజంలో వారికి గౌరవం పెరుగుతుంది. హింసాత్మక ధోరణులు తగ్గుతాయి. ఇది సాధించాలంటే రాజకీయాధికారమే మార్గం" అంటారు సారా. ఆ ఆశయాన్ని సాకారం చేసుకోవడం కోసం డెమొక్రటిక్ పార్టీలో చేరారు. 016లో ఆ పార్టీ ఫిలడెల్ఫియాలో నిర్వహించిన భారీ సదస్సును ఉద్దేశించి "నా పేరు సారా మెక్ బ్రైడ్. నేను ట్రాన్స్‌జెండర్ అమెరికన్‌ని" అంటూ ప్రారంభించి సారా చేసిన ఉద్వేగమైన ప్రసంగం అందరినీ ఆకట్టుకోవడమే కాదు, ఆలోచింపజేసింది కూడా. అమెరికాలో... ఒక ప్రధాన రాజకీయ పార్టీ సదస్సులో ట్రాన్స్‌జెండర్ ప్రసంగించడం అదే మొదటిసారి.



ముత్యాల ముగ్గు
11 చుక్కలు,
సంధుచుక్కలు, 7వ
చుక్కలో నిలపాలి



## బంగ్లా పాస్ పోర్టు రద్దు.. భారత్‌లో వీసా పొడిగింపు..



**న్యూఢిల్లీ-నవభూమి:** 'పుట్టింటికి ఆడబిడ్డ' అంటే ఇదేనేమో..? ఇప్పటికే ఓ సారి కొన్నేళ్ల పాటు భారత్ లో తలదాచుకున్న ఆమె.. ప్రస్తుతం మళ్లీ కొన్నేళ్లు ప్రవాస జీవితం గడపాల్సి వస్తోంది. అప్పట్లో చెల్లెలుతో కలిసి మన దేశాన్ని ఆశ్రయించిన ఆమె.. ఇప్పుడు అదే చెల్లెలితో భారత్ లో జీవితం గడుపుతున్నారు. నాడు యువతిగా ఉన్న ఆమె.. నేడు వయోధికురాలిగా అనుకోని ప్రవాసంలో ఉండాల్సి వస్తోంది. నిరుడు ఆగస్టులో అనూహ్యంగా పదవిని కోల్పోయారు బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు రిజర్వేషన్ కొనసాగింపు అంశం తీవ్ర నిరసనలు, హింస, తిరుగుబాటుకు దారితీయడంతో హసీనా అప్పటికప్పుడు రాజీనామా చేసి ఉన్నపళంగా భారత్ కు వచ్చేశారు. ఘజియాబాద్ చేరుకున్న ఆమెకు భారత ప్రభుత్వం ఆతిథ్యం ఇచ్చింది. ఇది జరిగి ఐదు నెలలైంది. అప్పటినుంచి హసీనా భారత్ లోనే ఉంటున్నారు. బంగ్లాదేశ్ నుంచి తొలుత బ్రిటన్ వెళ్లాలని భావించినా హసీనా వచ్చేందుకు ఆ దేశ ప్రభుత్వం అంగీకరించ లేదు. దీంతో ఢిల్లీకి చేరుకున్నారు. తర్వాత ఆమె ఎక్కడకు వెళ్లేదీ తేలలేదు. కేసులే కేసులు.. మొహమ్మద్ యూనస్ సారథ్యంలోని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం షేక్ హసీనాపై కేసుల మీద కేసులు నమోదు చేస్తోంది. ఇప్పటికే వీటి సంఖ్య 50 దాటింది. దీంతో హసీనా ఒకవేళ బంగ్లాదేశ్ కు వెళ్లినా జైలు పాలు కాక తప్పదు. మరోవైపు ఆమె పార్టీ క్యాడర్ చెల్లాచెదురైంది. వీటన్నటి మధ్య హసీనా పాస్ పోర్టును రద్దు చేసింది బంగ్లా ప్రభుత్వం. ఇప్పటికే ఆమెను తమకు అప్పగించాలని బంగ్లా తాత్కాలిక ప్రభుత్వం కోరుతోంది.

## 'ఆప్'కు మమత మద్దతు.. కృతజ్ఞతలు చెప్పిన కేజ్రీ



**న్యూఢిల్లీ-నవభూమి:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ కి మమతా బెనర్జీ సారథ్యంలోని టీఎంసీమద్దతు తెలిపింది. ఇప్పటికే ఆప్‌కు మద్దతిస్తున్నట్లు సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ప్రకటించిన నేపథ్యంలో టీఎంసీ మద్దతు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. దీనిపై సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మమతాబెనర్జీకి కేజ్రీవాల్ కృతజ్ఞతలు తెలిపారు."ఢిల్లీ ఎన్నికల్లో ఆప్‌కు మద్దతిస్తున్నట్టు టీఎంసీ ప్రకటించింది. మమతా దీదీకి వ్యక్తిగతంగా నా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. థాంక్యూ దీదీ.. మేము బాగున్నప్పుడు, క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడూ కూడా మీరు మా వెన్నంటే ఉండి ఆశీర్వదిస్తున్నారు" అని కేజ్రీవాల్ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. ఆయన ట్వీట్‌కు టీఎంసీ ఎంపీ డెరిక్ ఒబ్రెయిన్ వెంటనే 'ఎక్స్'లో స్పందించారు. మేము మీకు బాసటగా ఉంటామంటూ ఆ ట్వీట్‌లో ఒబ్రెయిన్ హామీ ఇచ్చారు.గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో ఆప్ పొత్తుపెట్టుకున్నప్పటికీ ఆ తర్వాత జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ఒంటరిగా పోటీ చేసింది. తాజాగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఒంటరిగానే పోటీ చేస్తున్నట్టు ఆప్ మొదట్లోనే ప్రకటించింది. ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగనుండగా, ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడతాయి.

## మేము విపక్షమైతే బీజేపీ మీ దోస్తా?.. గెహ్లాట్‌ను నిలదీసిన కేజ్రీ



**న్యూఢిల్లీ-నవభూమి:** 'ఇండియా' కూటమిలో మిత్రపక్షంగా ఉంటూ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎవరికి వారే యమునాతీరే అన్నట్టుగా విడివిడిగా పోటీ చేస్తున్న ఆప్ మధ్య మాటల యుద్ధం నెలకొంది. ఢిల్లీలో 'ఆప్' తమకు విపక్షమని రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి బుధవారంనాడు జరిగిన ఒక కార్యక్రమంలో రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ వ్యాఖ్యానించడంపై ఆప్ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ) చురకలు వేశారు. 'ఆప్'కు వ్యతిరేకంగా భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ కలిసికట్టుగా పనిచేస్తున్నట్టు ప్రజలు అనుకుంటున్నారని అన్నారు."గెహ్లాట్ జీ... ఢిల్లీలో కాంగ్రెస్‌కు ప్రత్యర్థి 'ఆప్' అంటూ మీరు చెప్పారు. బీజేపీ ఊసెత్తలేదు. దీంతో ప్రజలుకూడా కాంగ్రెస్‌కు ఆప్ ప్రత్యర్థి అని, బీజేపీకి భాగస్వామి అని అనుకుంటున్నారు. ఆప్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్, బీజేపీ కలిసి పనిచేస్తున్నాయని కూడా ప్రజలు నమ్ముతున్నారు. ఇప్పటికీ వరకూ మీ రెండు పార్టీల మధ్య సహకారం రహస్యంగా ఉంది. ఈరోజు మీరు ఆ విషయాన్ని బహిరంగంగానే చెప్పారు. మీ వివరణకు ఢిల్లీ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను" అని కేజ్రీవాల్ 'ఎక్స్'లో ఒక పోస్ట్ పెట్టారు. గెహ్లాట్ ఏమన్నారు?..గెహ్లాట్ బుధవారం ఉదయం మాట్లాడుతూ, కాంగ్రెస్‌కు ఆప్ ప్రత్యర్థి అని, ఢిల్లీలో ఇప్పుడు పరిస్థితి మారిందని చెప్పారు. కాంగ్రెస్ ఈసారి మెరుగైన ప్రచారం చేయనుందని, ఫలితాలు కూడా భిన్నంగా ఉంటాయని చెప్పారు. ఢిల్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశాలు మెరుగయ్యాయని, కాంగ్రెస్ అధికారంలోకి రావడం దేశానికి కూడా అవసరమని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల హామీలో భాగంగా రూ.25 లక్షల ఆరోగ్య బీమా పథకాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఢిల్లీలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలందరికీ రూ.25 లక్షల ఆరోగ్య బీమా కల్పిస్తామని, ఈ హామీని పార్టీ మేనిఫెస్టోలో చేరుస్తామని తెలిపింది. ఫిబ్రవరి 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగనుండగా, ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడతాయి.

## మన్మోహన్‌కు అవమానం.. ప్రణబ్‌కు గిఫ్ట్

**న్యూఢిల్లీ-నవభూమి:** మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి రాష్ట్రపతి స్మృతి ఏరియా కాంప్లెక్స్ వద్ద స్మారకం ఏర్పాటు చేసేందుకు కేంద్రం తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ నేత డేనిష్ అలీ మండిపడ్డారు. మరణాలను కూడా నీచ రాజకీయాలకు బీజేపీ వాడుకుంటోందని విమర్శించారు. మాజీ ప్రధాని దివంగత మన్మోహన్ సింగ్‌కు రాజ్‌ఘాట్ మెమోరియల్ సైట్ వద్ద స్థలం కేటాయించాలని యావద్దేశం డిమాండ్ చేస్తే దానిని తోసిపుచ్చిన మోదీ ప్రభుత్వం అదే స్థలంలో ముఖర్జీ స్మారకానికి నిర్ణయించిందని అన్నారు. ఇది దేశంలో ఆర్థిక విప్లవం తీసుకువచ్చిన ప్రధానమంత్రిని (మన్మోహన్) దారుణంగా అమానించడమేనని సామాజిక్ మాధ్యమం 'ఎక్స్'లో డేనిష్ అలీ విమర్శించారు.నాగపూర్‌లో 2018లో జరిగిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యక్రమంలో ప్రణబ్ ముఖర్జీ పాల్గొన్న విషయాన్ని డేనిష్ అలీ గుర్తు చేశారు. "సంఘ్‌పై ప్రణబ్ చూపించిన ప్రేమకు ప్రతిగానే ఆయన కేంద్రం తాజా గిఫ్ట్ ఇచ్చింది. నాగపూర్ ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం ముందు ప్రణబ్ తలవంచి, సంఘ్ వ్యవస్థాపకుడు హేడ్గేవార్ పేరిట ఏర్పాటు చేసిన ధర్మపుత్ర టైటిల్‌ను అందుకున్నారు. పార్లమెంటు హౌస్‌లో సావర్కర్ చిత్తరువు ఏర్పాటులో కూడా ప్రణబ్ కీలక పాత్ర పోషించారు" అని డేనిష్ అలీ తెలిపారు.

కాగా, దీనికి ముందు ప్రణబ్ ముఖర్జీ స్మారక స్థూపాన్ని ఢిల్లీలో ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాజ్‌ఘాట్ కాంప్లెక్స్ పరిధిలోని రాష్ట్రీయ స్మృతి స్థల్‌లో దీన్ని నెలకొల్పనుంది. ఈ సమాచారాన్ని తెలియజేస్తూ కేంద్ర గృహనిర్మాణ-పట్టణాభివృద్ధి శాఖ అధికారులు తనకు లేఖ పంపారని ప్రణబ్ కుమార్తె శర్మిష్ఠ తెలిపారు. ప్రధాని మోదీకి కృతజ్ఞతలు చెప్పారు. ప్రణబ్ చనిపోయినప్పుడు సంతాపం తెలిపేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేకంగా భేటీ కాలేదంటూ ఇటీవల శర్మిష్ఠ విమర్శలు చేశారు. కాంగ్రెస్ వెటరన్ నేత అయిన ప్రణబ్ ముఖర్జీ గతంలో ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు, డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో కీలక మంత్రి పదవులు నిర్వహించారు. 2012 నుంచి 2017 వరకూ భారత రాష్ట్రపతిగా సేవలందించారు. 2020 ఆగస్టు 31న ప్రణబ్ కన్నుమూశారు.

# స్త్రీల శరీరాకృతిపై కామెంట్లు చేసినా లైంగిక వేధింపే: కేరళ హైకోర్టు




**న్యూఢిల్లీ-నవభూమి:** మహిళల శరీరాకృతిపై ఎవరైనా తప్పుడు కామెంట్లు చేసినా అది లైంగిక వేధింపుల కిందకే వస్తుందని కేరళ హైకోర్టు తెలిపింది. ఉద్దేశ పూర్వకంగా చేసే పదాలు, శబ్దాలు, హావభావాలు, పలు రకాల చర్యలు ప్రదర్శించడం వంటివి అన్నీ స్త్రీని అవమానించడం కిందకే వస్తాయని తేల్చి చెప్పింది. తనపై నమోదైన కేసు కొట్టి వేయాలంటూ కేరళ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ బోర్డు మాజీ ఉద్యోగి వేసిన పిటిషన్‌ను కొట్టి వేస్తూ న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది.

మహిళల శరీరాకృతిపై ఎవరు తప్పుడు కామెంట్లు చేసినా అది లైంగిక వేధింపుల కిందకే వస్తుందంటూ కేరళ హైకోర్టు తేల్చి చెప్పింది. ఉద్దేశపూర్వకంగా చేసే పదాలు, శబ్దాలు, హావభావాలు, పలు రకాల వస్తు ప్రదర్శనలు, స్త్రీల గోపత్యకు భంగం కల్పించడం సైతం స్త్రీలను అవమానించడం కిందకే వస్తాయని వివరించింది. ముఖ్యంగా శరీరాకృతి, రంగుపై ఎలాంటి వ్యాఖ్యలు చేసినా వాటిని లైంగిక వేధింపుల నేరంగానే పరిగణించాలని తెలిపింది. సహోద్యోగి పట్ల లైంగింకంగా ప్రవర్తించాడనే ఆరోపణలపై తనపై వేసిన కేసును కొట్టి వేయాలంటూ కేరళ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ బోర్డు మాజీ ఉద్యోగి వేసిన పిటిషన్‌పై న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది.స్త్రీల శరీరాకృతిపై అసభ్య కామెంట్లు చేస్తే ఐపీసీ సెక్షన్ 509 ప్రకారం నేరంగా పరిగణించబడుతుందని జస్టిస్ ఎ బదరుద్దీన్ వివరించారు. ఈ నేరానికి మూడు సంవత్సరాల వరకు సాధారణ జైలు శిక్ష మరియు జరిమానా విధించబడుతుందని చెప్పారు. అంతేకాకుండా ఈ కేసు 2013కు సంబంధించిందని వెల్లడించారు. కేరళ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ బోర్డు ఉద్యోగి విధుల్లో ఉన్న సమయంలో తనపై వైధింపులకు పాల్పడ్డారంటూ అదే సంస్థలో పని చేస్తున్న ఈ మహిళా స్టాఫర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ముఖ్యంగా అసభ్య పదజాలంతో తనను దూషిస్తున్నారని, ఆ తర్వాత అభ్యంతరకర మెసేజ్‌లు, వాయిస్ కాల్స్ కూడా చేసేవారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది.

ముఖ్యంగా తన రంగు, శరీర ఆకృతిని అభివర్ణిస్తూ ఉద్దేశ పూర్వకంగానే అనుచిత వ్యాఖ్యలు చేరారంటూ చెప్పుకురాగా.. పోలీసులు అతడిపై లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. అయితే ఈ కేసు కొట్టి వేయాలంటూ సదరు ఉద్యోగి కేరళ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆమెను తాను అసభ్య పదజాలంతో అవమానించలేదని.. ముఖ్యంగా ఆమె చాలా అందంగా ఉన్నారనే ఉద్దేశంతోనే ఆ కామెంట్లు చేసినట్లు వెల్లడించారు. దీన్ని లైంగిక వేధింపుల కేసుగా చూడొద్దని హైకోర్టును కోరారు.


కానీ న్యాయస్థానం మాత్రం ఆయన చేసింది తప్పేనని తేల్చి చెప్పింది. ఉద్దేశ పూర్వకంగా మహిళల శరీరాకృతిపై ఎలాంటి కామెంట్లు చేసినా అది లైంగిక వేధింపుల కేసు కిందకే వస్తుందని వివరించింది. అంతేకాకుండా ఆయన చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. ఇకపై ఎవరు ఇలాంటి వ్యాఖ్యలు చేసిన ఇదే కేసు నమోదు చేయాలని అందరికీ సూచించింది.

## శరీరంలో ఆ భాగంపైనే హెచ్ఎంపీవీ దాడి.. సంచలన అధ్యయనం



**న్యూఢిల్లీ-నవభూమి:** ఐదేళ్ల కింద చైనాలో వెలుగుచూసిన కోవిడ్-19తో యావత్తు ప్రపంచం కుదేలైంది. చైనా నిర్లక్ష్యం వైఖరితో ప్రపంచం మొత్తం ఇబ్బందిపడాల్సి వచ్చింది. వైరస్ వ్యాప్తిపై తొలినాళ్లలో డ్రాగన్ కంట్రీ ఎటువంటి సమాచారం ఇవ్వకపోవడంతో అన్ని దేశాలకు అది విస్తరించింది. ప్రపంచ మహమ్మారిగా మారి.. లక్షల మందిని బలితీసుకుంది. ఈ క్రమంలో మరో వైరస్ ఆ దేశంలో వ్యాప్తి చెందుతుండటం.. మిగతా దేశాల్లోనూ ఆ కేసులు బయటపడుతుండటంతో మరో మహమ్మారి తప్పదేమోనని భయం వెంటాడుతోంది.చైనాలో వేగంగా వ్యాపిస్తోన్న హ్యూమన్ మోటాన్యుమో వైరస్. భారత్‌లోకి ప్రవేశించింది. ఇప్పటి వరకూ దేశంలో మొత్తం ఏడుగురు చిన్నారులకు ఈ వైరస్ నిర్ధారణ అయ్యింది. కరోనా మాదిరిగానే జలుబు, జ్వరం, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు ఉండే ఈ వైరస్ శ్వాసకోశ వ్యవస్థపై ప్రభావం చూపుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే, కిడ్నీలపై వైరస్ దాడిచేస్తుందని తమ పరిశోధనలో వెల్లడైనట్టు ఆసియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ నిపుణుల బృందం తాజాగా వెల్లడించింది. 'మా ఆసుపత్రిలో చేరిన పిల్లలపై జరిగిన అధ్యయనంలో కిడ్నీ గాయాలకు హెచ్ఎంపీవీ సంక్రమణతో సంబంధం ఉందని గుర్తించాం.. వయస్సుతో పాటు ప్రమాదం పెరుగుతుందని, కిడ్నీ గాయం శ్వాసకోశ సమస్యలతో ఖచ్చితంగా సంబంధం ఉండకపోవచ్చని పరిశోధన సూచిస్తుంది' అని డాక్టర్ విజయ్ కిరణ్ అన్నారు."అవయవ మార్పిడి రోగులు ముఖ్యంగా కిడ్నీ, ఊపిరితిత్తుల మార్పిడి చేయించుకున్నవారిపై హెచ్ఎంపీవీ తీవ్ర ప్రభావం చూపుతుంది... రోగనిరోధక శక్తిని తగ్గించే ఔషధాలు వైరస్ ప్రభావాన్ని తీవ్రతరం చేస్తాయి.. ఇది తీవ్రమైన శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్‌లకు దారితీయవచ్చు.. అక్యూట్ రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్ ప్రమాదాన్ని పెంచుతుంది" అని పేర్కొన్నారు.సాధారణ వైరస్‌ల్లాగే దగ్గు, జ్వరం, గొంతు నొప్పి, ముక్కు కారటం, శ్వాసతీసుకోవడంలో ఇబ్బంది, గురకలు వంటి లక్షణాలే ఈ వైరస్ బాధితుల్లోనూ ఉంటాయని ఆయన చెప్పారు. అయితే, 'ప్రత్యక్షంగా కిడ్నీలకు నష్టం కలిగిస్తుందనడానికి విస్తృత ఆధారాలు లభించనప్పటికీ దీనిని మరింత నిశితంగా పర్యవేక్షించాలి.. ముఖ్యంగా అధిక ముప్పు ఉన్నవారి విషయంలో అప్రమత్తంగా ఉండాలి'అని తెలిపారు.ఇదిలా ఉండగా.. హ్యూమన్ మెటాన్యూమోవైరస్ కొత్తది కాదు. దీనిని మొదటిసారి 2001లో గుర్తించినప్పటికీ 1970వ దశకం నుంచి మానవుల్లో వ్యాప్తిలో ఉన్నట్టు పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 4- 16 శాతం వరకూ ఇన్‌ఫెక్షన్లకు కారణమయ్యే ఈ వైరస్.. నవంబరు నుంచి మే మధ్య ఉద్ధృతంగా వ్యాప్తి చెందుతుంది. గతంలో ఈ వైరస్‌కు గురైనవారిలో రోగనిరోధకశక్తి వృద్ధి చెందినా.. మొదటిసారిగా హెచ్ఎంపీవీ బారినపడ్డ శిశువులు, తక్కువ రోగనిరోధక వ్యవస్థ ఉన్న వ్యక్తులలో తీవ్రమైన లక్షణాలను కలిగిస్తుంది.

## బొగ్గు గనిలోకి ఉప్పొంగిన నీరు..ముగ్గురు జలసమాధి



**గువాహటి-నవభూమి:** అసోం లోని ఓ బొగ్గుగనిలో ఊహించని ప్రమాదం సంభవించింది. గనిలోకి ఒక్కసారిగా నీరు వచ్చి చేరడంతో ముగ్గురు కార్మికులు జల సమాధి అయ్యారు మరో 9 మంది కార్మికులు లోపలే చిక్కుకుపోయారు. అయితే సదరు గనికి అనుమతులు లేవని తెలుస్తోంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం దిమాహసావో జిల్లాలోని ఓ బొగ్గుగనిలోకి సోమరాత్రి ఒక్కసారికి పెద్దఎత్తున నీరు వచ్చి చేరింది. దాంతో గనిలో ఉన్న వారిలో ముగ్గురు జలసమాధవ్వగా, లోపలే మరో 9 మంది చిక్కుకుపోయారు. వారిని రక్షించేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. నేవీ బృందం కూడా సహాయక చర్యల్లో పాల్గొంటోంది. ఈ ప్రమాదానికి సంబంధించి ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, ప్రాథమిక సమాచారం ప్రకారం ఆ గనికి అనుమతులు లేనట్లు తెలిసిందని అసోం సీఎం హిమంత వెల్లడించారు. కాగా, 2019లో మేఘాలయలోనూ ఇలాంటి ప్రమాదంలో 15 మంది చనిపోయారు.

## ఎక్కడ దాక్కున్నా పట్టిచ్చే 'భారత్ పోల్'

**న్యూఢిల్లీ-నవభూమి:** మనదేశంలోని దర్యాప్తు సంస్థలు, రాష్ట్ర పోలీసు విభాగాల మధ్య సమన్వయానికి కీలకంగా దోహదపడే 'భారత్ పోల్' పోర్టల్‌ను కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా మంగళవారం ఇక్కడ ఆవిష్కరించారు. కేసుల విషయంలో అంతర్జాతీయంగా పనిచేస్తున్న మన దర్యాప్తు సంస్థల పనిని ఈ పోర్టల్ సులభతరం చేస్తుందని, ఇంటర్‌పోల్ సహకారం వేగంగా అందుకోగలుగుతామని ఆయన అన్నారు. 'భారత్ పోల్'ను సీబీఐ రూపొందించింది. "అంతర్జాతీయ పోలీసుల సహకారం ఇప్పటిదాకా సీబీఐ మాత్రమే తీసుకుంటోంది. 'భారత్ పోల్' రాకతో మన దేశానికి చెందిన అన్నీ దర్యాప్తు సంస్థలూ, చివరకు రాష్ట్ర పోలీసు విభాగాలు సైతం ఇంటర్‌పోల్ సాయం తీసుకొనగలుగుతాయి. అంతర్జాతీయంగా మనదేశం చేపట్టే విచారణ ప్రక్రియను కొత్త శకంలోకి ఇది నడిపిస్తుంది. వేర్వేరు సంస్థల మధ్య సమన్వయం, సంబంధాల్లో తలెత్తుతున్న సమస్యలు తొలగించి..నేరగాళ్ల కట్టడికి బాగా పనిచేస్తుంది" అని అమిత్‌షా అన్నారు.

## హనీరోజ్ వేధింపుల కేసు... సిట్ అధికారుల కీలక స్టెప్!



**న్యూఢిల్లీ-నవభూమి:** ఇటీవల కాలంలో నటీమణుల వేధింపుల వ్యవహారం మలయాళ సినిమా ఇండస్ట్రీలో తీవ్ర చర్చనీయాంశంగా మారిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పలు సంచలన ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఈ క్రమంలోనే తాను వేధింపులు ఎదుర్కొన్నట్లు నటి హనీరోజ్ తెలిపారు. ఈ ఫిర్యాదుకు సంబంధించిన కేసులో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. సోషల్ మీడియా వేదికగా తాను వేధింపులు ఎదుర్కొన్నట్లు తెలిపిన మలయాళ నటి హనీరోజ్.. పోలీసులను ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈమె ఫిర్యాదుతో సుమారు 27 మందిపై ఎర్నాకుళం పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో.. ఇందులో కీలక వ్యక్తిగా భావించిన వ్యాపారవేత్త బాబీ చెమ్మనూరును సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా స్పందించిన నటీ హనీ రోజ్... ఇప్పుడు తనకు ఎంతో ప్రశాంతంగా ఉందని చెబుతూ.. ఈ కేసూ గురించి ఇప్పటికే కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ దృష్టికి తిసుకెళ్లినట్లు తెలిపారు. అయితే.. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం తనకు మాట ఇచ్చారని హనీ రోజ్ వెల్లడించారు. కాగా... ఓ వ్యాపారవేత్త వల్ల తాను ఇబ్బంది పడుతున్నట్లు హనీ రోజ్ ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా.. ఓ వ్యక్తి తనను కావాలని అవమానించడానికి ప్రయత్నిస్తున్నాడని.. తాను సైలెంట్ గా ఉంటుంటుటే.. ఆ వ్యాఖ్యలను స్వాగతిస్తున్నావా అని పలువురు ప్రశ్నిస్తున్నారని ఆమె తెలిపారు. వాస్తవానికి ఆ వ్యక్తి గతంలో తనను కొన్ని కార్యక్రమాలకు ఆహ్వానించాడని.. అయితే, వేరువేరు కారణాల వల్ల వెళ్లేందుకు నిరాకరించినట్లు ఆమె తెలిపారు. నాటీ నుంచి నేను హాజరయ్యే ప్రతీ ఈవెంటుకూ రావడం, వీలు కుదిరినప్పుడల్ల తనను కించపరిచేలా వ్యాఖ్యానించడం ప్రారంభించాడని అమె తెలిపారు. ఈ నేపథ్యంలోనే పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపిన హనీరోజ్.. తన లుక్స్ పై సరదా జోక్స్, మీమ్స్ ను తాను స్వాగతిస్తానని.. వాటిని పెద్దగా పట్టించుకోకని.. కానీ.. అవి హద్దూ దాటి, అసభ్యకరంగా మారితే మాత్రం సహించనని స్పష్టం చేశారు. మరోవైపు... హనీరోజ్ కు మలయాళం మూవీ ఆర్టిస్ట్స్ సంఘం (అమ్మ) మద్దతు తెలిపింది. సోషల్ మీడియా వేదికగా ఆమెపై అభ్యంతరకర పోస్టులు పెడుతున్నవారిపై చట్టపరంగా తీసుకునే చర్యలకు తమ మద్దతు ఉంటుందని.. అవసరమైతే న్యాయ సహాయం అందజేస్తామని తెలిపింది.

## అప్పటిలోగా బందీలను విడుదల చేయకపోతే దాడులే.. హమాస్‌కు ట్రంప్ సీరియస్ వార్నింగ్

**వాషింగ్టన్-నవభూమి:** ఇజ్రాయెల్ హమాస్ మధ్య యుద్ధంతో



పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే హమాస్‌కు అమెరికాకు కాబోయే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. తాను అధ్యక్ష బాధ్యతలు చేపట్టకముందే హమాస్ ఉగ్రవాద సంస్థ చెరలో ఉన్న బందీలను విడిచిపెట్టాలని స్పష్టం చేశారు. లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. తాను అధ్యక్ష బాధ్యతలు చేపట్టేసరికి బందీలు తిరిగి రాకపోతే పశ్చిమాసియాలో ఆకస్మిక దాడులు జరుగుతాయని హెచ్చరించారు.కాగా, హమాస్‌కు ట్రంప్ ఇలా సీరియస్ వార్నింగ్ ఇవ్వడం ఇదేమీ మొదటిసారి కాదు. గతేడాది డిసెంబర్‌లో కూడా తీవ్రంగా హెచ్చరించారు. తాను అధ్యక్ష బాధ్యతలు చేపట్టకముందే హమాస్ ఉగ్రవాద సంస్థ చెరలో ఉన్న బందీలను విడిచిపెట్టాలని అల్టిమేటం జారీ చేశారు. లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. తాను అమెరికా అధ్యక్షుడిగా 2025 జనవరి 20న బాధ్యతలు స్వీకరిస్తానని ట్రంప్ స్పష్టం చేశారు. ఈలోపు బందీలను విడుదల చేయాలని తేల్చి చెప్పారు. లేదంటూ నరకం చూస్తారని, గతంలో ఎన్నడూ చూడని పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తీవ్రంగా హెచ్చరించారు.కాగా, గతేడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ మెరుపు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడిలో వెయ్యిమందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. దాడి అనంతరం దాదాపు 200 మందికిపైగా ప్రజలను హమాస్ బంధించి గాజాలోకి తీసుకెళ్లింది. ఆ తర్వాత తాత్కాలికంగా జరిగిన కాల్పుల విరమణ ఒప్పందం సందర్భంగా కొందరిని విడుదల చేసింది. బందీల్లో కొందరు ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం 51 మంది సజీవంగా ఉన్నారు.

# బ్యాంకులదే పూర్తి బాధ్యత



**న్యూఢిల్లీ-నవభూమి:** కస్టమర్ కేర్ మోసాలు.. మాల్‌వేర్‌తో ఖాతాలను ఖాళీ చేసే సైబర్ నేరాల విషయంలో బాధితులకు ఊరట కలిగించేలా సుప్రీంకోర్టు కీలక తీర్పునిచ్చింది. అనుమతి లేని/మోసపూరిత ఆన్‌లైన్ లావాదేవీల కారణంగా తమ ప్రమేయం లేకుండానే ఖాతాలోని డబ్బు పోగొట్టుకున్న బాధితులు మూడ్రోజుల్లో ఫిర్యాదు చేస్తే.. బ్యాంకులు పరిహారం ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పింది. అయితే.. భారతీయ రిజర్వ్ బ్యాంకు(ఆర్‌బీఐ) 2017 జూలై 6న ఇచ్చిన సర్క్యులర్‌లో పేర్కొన్నట్లుగా బాధితులు మూడ్రోజుల్లో ఫిర్యాదు చేస్తే.. థర్డ్‌పార్టీ యాప్, వ్యక్తుల ద్వారా జరిగే మోసాల విషయంలోనూ బాధితులకు ఊరట కలిగించాల్సిన బాధ్యత బ్యాంకులదేనని స్పష్టం చేసింది. గువాహటికి చెందిన పల్లబ్ భౌమిక్ అనే బాధితుడి విషయంలో జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌ల ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. బాధితుడు 2021లో ప్రపంచ దిగ్గజ గార్మెంట్స్ సంస్థ లూయీఫిలిప్ నుంచి రూ.4 వేలు వెచ్చించి, ఓ బ్లేజర్ కొనుగోలు చేశారు. ఆ తర్వాత.. దాన్ని వాపస్ చేస్తానంటూ లూయీఫిలిప్ వెబ్‌సైట్‌లో కస్టమర్ కేర్‌కు సమాచారం ఇచ్చారు. తనకు రూ.4 వేలను వెనక్కి ఇవ్వాలని కోరారు. అయితే.. 2021లో లూయీఫిలిప్ వెబ్‌సైట్ హ్యాకింగ్‌కు గురై.. ఆ సైట్ నియంత్ర హ్యాకర్ల చేతికి వెళ్లిపోయింది. వెబ్‌సైట్‌లో కస్టమర్‌కేర్‌ను సంప్రదించినట్లు బాధితుడు భావించినా.. దీన్ని సైబర్ నేరగాళ్లు అవకాశంగా మలచుకుని, లూయీఫిలిప్ మేనేజర్ పేరుతో ఫోన్ చేశారు. "తప్పకుండా మీ సొమ్మును తిరిగి ఇస్తాం.

అయితే.. మీరు మేము పంపే లింకు ద్వారా యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి" అని సూచించారు. బాధితుడు ఆ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయగానే.. అతని ఎస్‌బీఐ ఖాతాలో ఉన్న రూ.94,204.80 గూగుల్‌పే ద్వారా సైబర్ నేరగాళ్ల ఖాతాకు బదిలీ అయ్యింది. తన ఖాతా ఖాళీ అవ్వడంతో బాధితుడు ఎస్‌బీఐ కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసి, జరిగిన మోసంపై ఫిర్యాదు చేశారు. అయితే గూగుల్‌పే ద్వారా లావాదేవీలు జరిగినందున తాము బాధ్యులం కాదని కస్టమర్‌కేర్ సిబ్బంది సమాధానమిచ్చారు. దాంతో బాధితుడు గువాహటి పోలీసులు, అసోం సీఐడీ సైబర్ క్రైమ్ సెల్, జాతీయ సైబర్ నేరాల నమోదు పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్‌ను సంప్రదించినా.. న్యాయం జరగకపోవడంతో గువాహటి హైకోర్టును ఆశ్రయించారు. ఈలోగా నిందితుడు ఉత్తరప్రదేశ్‌కు చెందినవాడని సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. నేరం జరిగిన 24 గంటల్లోనే బాధితుడు ఫిర్యాదు చేశారని, ఎస్‌బీఐదే లోపమని హైకోర్టు సింగిల్ బెంచ్ స్పష్టం చేసింది. అతను కోల్పోయిన రూ.94,204.80ని తిరిగి ఇచ్చేయాలని తీర్పునిచ్చింది. ఆ తీర్పుపై ఎస్‌బీఐ డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. బాధితుడు గూగుల్‌పే ద్వారా డబ్బును బదిలీ చేశాడని, అతనికి ఓటీపీ కూడా వచ్చిందని బ్యాంకు తరఫు న్యాయవాదులు వాదనలను వినిపించారు. అయితే.. బాధితుడి పక్షానే న్యాయం ఉండడంతో.. ఎస్‌బీఐ సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. తాజాగా ఈ కేసును విచారించిన జస్టిస్ జేబీ పార్దివాలా నేతృత్వంలోని ధర్మాసనం ఎస్‌బీఐనే తప్పుబట్టింది. "ఎస్‌బీఐ వద్ద అధునాతన సాంకేతికత ఉంటుంది. అనుమతి లేని/మోసపూరిత ఆన్‌లైన్ లావాదేవీలను గుర్తించి, నియంత్రించే అవకాశాలుంటాయి. బాధితుడి ప్రమేయం లేకుండానే ఆయన ఖాతాలోని సొమ్ము బదిలీ అయ్యింది. కాబట్టి.. ఎస్‌బీఐ అతనికి పరిహారంగా మొత్తం సొమ్మును తిరిగి ఇవ్వాల్సిందే" అని తీర్పునిచ్చింది. అదే సమయంలో బ్యాంకు ఖాతాదారులు కూడా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఓటీపీని ఇతరులకు చెప్పినా.. నిర్లక్ష్యంగా వ్యవహరించినా.. ఖాతాదారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
8 | హైదరాబాద్ | గురువారం | 09 । జనవరి । 2025



# ఆ సన్నివేశాలు తొలగించండి.. కోర్టును ఆశ్రయించిన నటి

అభిమన్యు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది కన్నడ భామ రమ్య . ఈ మాజీ మైసూరు ఎంపీ తాజాగా కోర్టును ఆశ్రయించింది. 2023లో రిలీజైన కన్నడ కామెడీ డ్రామా రమ్య కామియో రోల్‌లో మెరిసింది. అయితే తన అనుమతి లేకుండా ఈ సినిమాలో ఉపయోగించిన సీన్లను తొలగించాలని నిర్మాతలను కోరుతూ బెంగళూరులోని కమర్షియల్ కోర్టు కాంప్లెక్స్‌ను ఆశ్రయించింది.ట్రైలర్‌తోపాటు సినిమాలోని ఫుటేజీలో కొన్ని సన్నివేశాలను తన ప్రమేయం లేకుండా వాడారని రమ్య ఫిర్యాదులో పేర్కొన్నది. నిర్మాతలు అనుమతి లేకుండా వాడిన తన వీడియోలను తొలగించడమే కాకుండా.. తనకు కోటి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ విషయమై నిర్మాతలకు పలుమార్లు విజ్ఞప్తి చేసిన తన సీన్లు తొలగించడం, ఎలాంటి యాక్షన్ తీసుకోవడం కానీ చేయలేదని రమ్య ఆరోపించింది.సినిమాలోని తన సన్నివేశాలను తొలగిస్తే కేసును వెనక్కి తీసుకుంటానని కూడా రమ్య చెప్పినట్టు ఇండస్ట్రీ సర్కిల్ టాక్. మరి రమ్య వ్యవహారంపై నిర్మాతలు ఎలా స్పందిస్తారనేది తెలియాల్సి ఉంది.





# అందాల రాయ్‌లక్ష్మి బికినీ షో

రెండు దశాబ్దాల క్రితం తెలుగు ప్రేక్షకులకు శ్రీకాంత్ తో కలిసి రాయ్ లక్ష్మి 'కాంచనమాల కేబుల్ టీవీ' సినిమాతో పరిచయం అయ్యింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు అందం అంతకంతకూ పెరుగుతూనే ఉంది తప్ప తగ్గడం లేదు. గతంలో లక్ష్మీ రాయ్ అంటూ పిలిపించుకున్న ఈ అమ్మడు లక్ కలిసి వస్తుందనే ఉద్దేశంతో రాయ్ లక్ష్మిగా పేరు మార్చుకుంది. పేరు మార్చుకోవడం వల్లనో లేదా ఆమె అందం వల్లనో కానీ రెండు దశాబ్దాలుగా ఇండస్ట్రీలో కొనసాగుతూనే ఉంది. ఈ మధ్య కాలంలో బాలీవుడ్‌లో ఈ అమ్మడు బిజీ అయ్యింది. టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ ఇలా అన్ని భాషల్లోనూ అందమైన ముద్దుగుమ్మ అంటూ గుర్తింపు దక్కించుకుంది. ఈమధ్య కాలంలో పవర్ ఫుల్ పాత్రల్లో, లేడీ ఓరియంటెడ్ సినిమాల్లో నటిస్తున్న రాయ్ లక్ష్మిని ప్రేక్షకులు అందాల ఆరబోత పాత్రల్లో చూడాలని కోరుకుంటున్నారు. గత ఏడాది ఒక సినిమాతో వచ్చిన ఈ అమ్మడు ఈ ఏడాది కనీసం రెండు మూడు సినిమాలతో వచ్చే విధంగా ప్లాన్ చేస్తుంది. వచ్చిన ప్రతి ఆఫర్‌ను సద్వినియోగం చేసుకునే ఉద్దేశ్యంతో ముద్దుగుమ్మ రాయ్ లక్ష్మి వరుసగా సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందట. మరో వైపు ఈ అమ్మడు సోషల్ మీడియాలో ఎప్పటిలాగే తన అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేస్తూనే ఉంది. తాజాగా మరోసారి రాయ్ లక్ష్మి చూపు తిప్పనివ్వని అందంతో ఫోటోలు షేర్ చేసి కన్నులు విందు చేసింది. గతంలో చాలా సార్లు రాయ్ లక్ష్మి బికినీ ఫోటో షూట్‌ను షేర్ చేసింది. ఎప్పటికప్పుడు విభిన్నంగా, మరింత అందంగా కనిపిస్తూ కవ్విస్తూ ఉంది. ఈసారి అంతకు మించి అంటూ ముద్దుగుమ్మ బికినీ ఫోటోలు ఉన్నాయి. లైట్ పింక్ కలర్‌లో ఉన్న బికినీ ధరించిన స్టైలిష్ గాగుల్స్ ధరించిన ముద్దుగుమ్మ రాయ్ లక్ష్మి ఇండస్ట్రీలో అడుగు పెట్టి ఇరవై ఏళ్లు అంటే నమ్మడానికి లేదు. ఆమె వయసు 20 ఏళ్లు అయ్యి ఉంటుందని కామెంట్స్ చేస్తున్నారు. పాతికేళ్ల పడుచు అమ్మాయి అన్నట్లుగా ఉన్న ఈ అమ్మడు ఇరవై ఏళ్లుగా సినిమాలు ఎలా చేస్తుందని కామెంట్స్ చేస్తున్నారు. ఇండస్ట్రీలోకి వచ్చి ఇరవై ఏళ్లు అవుతుంది కనుక వయసు దాదాపుగా నాలుగు పదుల వయసుకు చేరువ అయ్యి ఉంటుంది. అయినా ఇంత అందం ఎలా సాధ్యం అంటూ చాలా మంది అవాక్కవుతున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో ఈమె షేర్ చేసే ఫోటోలు వీడియోలు చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నెట్టింట ఈమె ఫోటోలకు వస్తున్న స్పందనతో మరిన్ని సినిమా ఆఫర్లు వస్తాయేమో చూడాలి.

# అభిమానుల కుటుంబాలకు రామ్ చరణ్ పరిహారం!



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా నటించిన లేటెస్ట్ మూవీ "గేమ్ ఛేంజర్" సినిమాకు సంబంధించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ రాజమండ్రిలో ఘనంగా జరిగిన సంగతి తెలిసిందే. ఈ వేడుకకు ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత, పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అయితే.. ఈ వేడుకకు వచ్చిన ఇద్దరు అభిమానులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదం నింపిన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమానికి హాజరైన కాకినాడ జిల్లా గైగోలుపాడుకు చెందిన తోకాడ చరణ్ (22), ఆరవ మణికంఠ అనే ఇద్దరు అభిమానులు.. వేడుక ముగిసిన అనంతరం బైక్ పై తిరిగి ఇంటికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఇందులో భాగంగా వీరు ప్రయాణిస్తున్న బైక్ ను వడిశలేరులో ఓ వ్యాన్ ఢీకొట్టింది. దీంతో వారిద్దరూ చనిపోయారు ఈ ఘటన గురించి తెలుసుకున్న సినిమా హీరో రామ్ చరణ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తన అభిమానుల ఇంటికి తన సన్నిహితులతో పాటు తన వ్యక్తిగత సిబ్బందిని పంపించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు చెరో రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. దీనికి సంబంధించిన వివరాలను తాజాగా కుటుంబ సభ్యులకు అందజేశారు. అవును... గేమ్ ఛేంజర్ సినిమా ఈవెంట్ కు హాజరై తిరిగి ఇంటికి వెళ్తున్న ఇద్దరు అభిమానులు రోడ్డు ప్రామాదంలో మృతి చెందడంతో రామ్ చరణ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ.. మృతులు ఇద్దరి కుటుంబాలకు తలో రూ.5 లక్షల పరిహారం ప్రకటించారు. ఈ సమయంలో.. ఆ మొత్తాన్ని ఆర్టీజీఎస్ ద్వారా అందించారు. ఈ నేపథ్యంలో తాజాగా దానికి సంబంధించిన వివరాలకు చెర్రీ ఫ్యాన్స్ బాధితుల పేరెంట్స్ కు అందచేశారు. కాగా.. ఇప్పటికే మృతుల కుటుంబాలకు సినిమా నిర్మాత దిల్ రాజుతో పాటు ఈ ప్రీ రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లు పరిహారం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా.. మృతుల కుటుంబాలకు దిల్ రాజు తలో రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించగా.. పవన్ కల్యాణ్ కూడా ఐదేసి లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.



# దేశంలో ముగ్గురు పెద్ద స్టార్ల వాట్సాప్ గ్రూప్ నేమ్ ఇదే

బాలీవుడ్‌ని దశాబ్దాల పాటు ఏల్తోంది ఖాన్‌ల త్రయం. షారుఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్, అమీర్ ఖాన్ ఆ ముగ్గురూ తెరపై కనిపిస్తే చాలు.. సంచలనాలే. బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడంలో ఒకరికొకరు పోటీ. ఆ ముగ్గురూ మంచి స్నేహితులు కూడా. ఒకరి సినిమా కోసం ఒకరు సహకారానికి ముందుకు వస్తారు. సల్మాన్-షారూఖ్-అమీర్ కలయికలో ఓ భారీ చిత్రం చూడాలని అభిమానులు ఆసక్తికరంగా ఇప్పుడు ఆ ముగ్గురి ఫోన్ నంబర్లతో వాట్సాప్ గ్రూప్ క్రియేటైతే దానికి ఎలాంటి టైటిల్ ఉండాలి? .. ఈ ప్రశ్నకు సరైన జవాబు దొరికింది. మై నేమ్ ఈజ్ ఖాన్‌అనే టైటిల్ సరిగ్గా సరిపోతుందని యువకథానాయిక అనన్య పాండే సూచించింది. కనెక్ట్ సినీ ఇంటర్వ్యూలో అనన్య పాండే రాపిడ్ ఫైర్‌రౌండ్‌లో ఈ సూచన చేసింది. దీనిలో ఆమె కొంత మంది ప్రముఖుల వాట్సాప్ గ్రూపులకు టైటిల్స్ ని నిర్ణయించింది. షారుఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్, అమీర్ ఖాన్ బృందానికి టైటిల్ ఇవ్వమని ప్రశ్నించగా..వెంటనే మై నేమ్ ఈజ్ ఖాన్ అని చెప్పింది. సినిమా టైటిల్‌తో స్ఫూర్తి పొందినా కానీ ఇది వందశాతం యాప్ట్ అని అభిమానులు మెచ్చుకుంటున్నారు. కరణ్ జోహార్, అలియా భట్, వరుణ్ ధావన్, సిద్ధార్థ్ మల్హోత్రా కలిసి ఉండే వాట్సాప్ గ్రూప్‌కి కూడా అనన్య పేరు పెట్టారు. ఇది కరణ్, అతడి స్టూడెంట్స్ కి సంబంధించినదిగా ఉండాలని సూచించింది. స్టూడెంట్స్ ఫర్ లైఫ్ అనే టైటిల్‌ని అనన్య సూచించింది. అలాగే కింగ్ ఖాన్ ముంబై నివాసం మన్నత్‌లో పార్టీల గురించి కూడా అనన్య ఓపెనైంది. మనీష్ మల్హోత్రా దీపావళి పార్టీలు, ఇతర పార్టీలకు సుహానా ఖాన్, సానాయ కపూర్, నవ్య నందతో కలిసి మన్నత్‌కు వెళతానని చెప్పింది.

# వెంకటేష్ తో రానా.. కరెక్ట్ టైంకి దించుతున్నారుగా..!



విక్టరీ వెంకటేష్ సంక్రాంతికి తన సినిమా సంక్రాంతికి వస్తున్నాం తో వస్తున్నాడు. అనీల్ రావిపూడి డైరెక్షన్ లో తెరకెక్కిన ఈ సినిమాను దిల్ రాజు నిర్మించారు. వెంకీ సరసన ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరిలు నటించారు. భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్ సినిమాకు సూపర్ బజ్ తీసుకొచ్చింది. పొంగల్ రేసులో బాలయ్య, చరణ్ సినిమాలతో పాటు వెంకటేష్ కూడా వస్తున్నాడు.ఐతే ఈ సినిమా ప్రమోషన్స్ ని ఒక రేంజ్ లో చేస్తున్నారు. అనీల్ రావిపూడి సినిమాని ప్రేక్షకుల్లో తీసుకెళ్లే ప్రయత్నంలో ఏ మాధ్యమాన్ని వదలట్లేదు. ఇక ఈ క్రమంలోనే రానా దగ్గుబాటి షోకి కూడా వెంకటేష్ అండ్ టీం సందడి చేశారు. అమెజాన్ ప్రైమ్‌లో వస్తున్న రానా దగ్గుబాటి షోకి ఇప్పటికే చాలామంది సెలబ్రిటీస్ రాగా వారితో రానా చిట్ చాట్ క్రేజీగా నడిచింది. ఇక ఇప్పుడు బాబాయ్ వెంకటేష్ తో రానా దగ్గుబాటి స్పెషల్ ఇంటర్వ్యూ చేస్తున్నాడు.

ఇంట్లోనే స్టార్‌ని పెట్టుకుని అతన్ని చిన్నప్పటి నుంచి చూస్తూ పెరిగిన రానా కూడా బాబాయ్ వెంకటేష్ గురించి ఎవరికీ తెలియని విషయాలు పంచుకునే ఛాన్స్ ఉంది. అంతేకాదు సంక్రాంతికి వస్తున్నాం సినిమా హీరోయిన్స్ ఐశ్వర్య, మీనాక్షిలు కూడా ఈ చిట్ చాట్ లో పాల్గొన్నారు. సంక్రాంతికే ఈ ఎపిసోడ్ కూడా వచ్చేలా ప్లాన్ చేస్తున్నారు. ప్రతి శనివారం ఒక సెలబ్రిటీ ఇంటర్వ్యూతో రానా సర్ ప్రైజ్ చేస్తున్నాడు.ఈ శనివారం విక్టరీ వెంకటేష్ తో రానా ఇంటర్వ్యూ రాబోతుంది. దీనికి సంబందించిన ప్రోమో రిలీజైంది. వెంకీ, రానా చాలా ఫన్నీగా చిట్ చాట్ చేశారు. అంతేకాదు ఈ చిట్ చాట్లో పాల్గొన్న ఐశ్వర్యా రాజేష్, మీనాక్షిలతో కూడా రకరకాల ఫన్ మూమెంట్స్ జరిగినట్టు తెలుస్తుంది. రానా దగ్గుబాటి వెంకటేష్ స్పెషల్ ఎపిసోడ్ ప్రోమోనే ఆకట్టుకోగా కచ్చితంగా ఫుల్ ఇంటర్వ్యూ అదిరిపోతుందని చెప్పొచ్చు. సంక్రాంతికి వస్తున్నాం సినిమా ప్రమోషన్స్ లో భాగంగా అటు స్మాల్ స్క్రీన్, డిజిటల్ స్క్రీన్ దేన్నీ వదలకుండా చేస్తున్నారు. వెంకటేష్ కూడా సినిమా చేశామా పని అయిపోయిందా అన్నట్టు కాకుండా సినిమా రిలీజ్ వరకు భారీగా ప్రమోషన్స్ లో పాల్గొంటూ సినిమాపై బజ్ పెంచుతున్నారు.

రానాతో వెంకటేష్ ఇంటర్వ్యూ దగ్గుబాటి ఫ్యాన్స్ కి సూపర్ జోష్ అందిసుందని చెప్పొచ్చు.

# చాంపియన్స్ ట్రోఫీలో కేఎల్ రాహుల్, షమీకి చోటు దక్కేనా..?



**న్యూఢిల్లీ-నవభూమి:**ఏడాది పాకిస్థాన్ వేదికగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ జరగనున్నది. ఈ మెగా ఈవెంట్‌కు బీసీసీఐ రేపో మాపో జట్టును ప్రకటించనున్నది. జట్టును ప్రకటించేందుకు ఈ నెల 12 వరకు అవకాశం ఉన్నది. ఫామ్‌లో లేని కెప్టెన్ రోహిత్ శర్మ, సీనియర్ క్రికెటర్ విరాట్ వన్డే జట్టులో చోటు దక్కనున్నది. అయితే, అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ జట్టు ఎంపిక కోసం ముగ్గురు సీనియర్ ఆటగాళ్లపై చర్చించే అవకాశం ఉన్నది. ఫిబ్రవరి 19 నుంచి చాంపియన్స్ ట్రోఫీ మొదలవనున్న నేపథ్యంలో కేఎల్ రాహుల్, మహ్మద్ షమీ, జడేజాలను తీసుకుంటారా? లేదా? అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. చివరగా 2023లో జరిగిన ప్రపంచకప్ జట్టులో ముగ్గురికి వరల్డ్ కప్‌లో చోటు దక్కింది.

వరల్డ్ కప్ తర్వాత షమీ, జడేజాలకు బీసీసీఐ విశ్రాంతి ఇచ్చింది. ఆ తర్వాత టీమిండియా కేవలం ఆరు వన్డేలు మాత్రమే ఆడింది. అయితే, కేఎల్ రాహుల్ మాత్రం దక్షిణాఫ్రికా, శ్రీలంకతో జరిగిన ద్వైపాక్షిక సిరీస్‌లో చోటు దక్కింది. శ్రీలంకతో సిరీస్‌లో రాహుల్‌ను మధ్యలోనే జట్టు నుంచి తప్పించింది. 2023 నవంబర్ 19న వరల్డ్ కప్ ఫైనల్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో 107 బంతులు ఆడిన రాహుల్.. కేవలం 66 పరుగులు మాత్రమే చేయడమే ప్రధాన కారణం. ఇక యువ ఆటగాడు యశస్వి జైస్వాల్ వన్డే జట్టులో చోటు దక్కించుకునే అవకాశాలున్నాయి. టాప్ ఫోర్‌లో ఎడమచేతి వాటం బ్యాట్స్‌మెన్‌కు బెర్త్ దాదాపు ఖాయంగా కనిపిస్తుంది.వికెట్ కీపర్‌గా పంత్‌కే ఛాన్స్..చాంపియన్స్ ట్రోఫీలో వికెట్ కీపర్‌గా రిషబ్ పంత్ వైపే సెలెక్టర్లు మొగ్గు చూపే అవకాశం ఉంది. రాహుల్ వికెట్ కీపింగ్ చేయకపోతే బ్యాట్స్‌మెన్‌గా జట్టులో స్థానం అనుమానమే. మరో వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ విజయ్ హజారే ట్రోఫీలో పరుగులు చేయడంలో విఫలమయ్యాడు.

# సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌కు ఐసీసీ ఎంత రేటింగ్ ఇచ్చిందంటే..?



**న్యూఢిల్లీ-నవభూమి:**అదే సమయంలో సిడ్నీ క్రికెట్ గ్రౌండ్ పిచ్‌కు సంతృప్తికరంగా ఉందంటూ రేటింగ్ ఇచ్చిందని చెప్పింది. వాస్తవానికి సిడ్నీ పిచ్ ఈ సారి బౌలర్లకు బాగా ఉపకరించింది. దాంతో బ్యాట్స్‌మెన్ పరుగులు తీసేందుకు ఇబ్బందిపడ్డారు. క్రికెట్ ఆస్ట్రేలియా క్రికెట్ ఆపరేషన్స్ చీఫ్ పీటర్ రోచ్ మాట్లాడుతూ ఆయా మైదానాల్లో ప్రత్యేకతను తెలిపే పిచ్‌లను సిద్ధం చేసేందుకు తాము ప్రయత్నిస్తామ న్నారు. తాము ఆతిథ్య జట్టుకు అనుకూలంగా, సహకరించేలా పిచ్‌లను సిద్ధం చేయమన్నారు. బ్యాట్‌కు, బంతికి మధ్య మంచి పోటీ ఉండేలా చూస్తామన్నారు. వాతావరణం సన్నాహకాలను ప్రభావితం చేసిందని.. ఎంత నైపుణ్యం కలిగిన క్యూరేటర్లయినా ప్రతికూల వాతావరణంతో ప్రభావితమవుతారని తమకు తెలుసునని పేర్కొన్నారు. ఇక సిడ్నీ పిచ్‌పై భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ విమర్శలు గుప్పించారు.

# త్రిసా-గాయత్రి శుభారంభం



**కౌలాలంపూర్-నవభూమి:** భారత డబుల్స్ జోడీ త్రిసా జాలీ-గాయత్రి మలేషియా ఓపెన్‌లో శుభారంభం చేసింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో త్రిసా-గాయత్రి ద్వయం 21-10, 21-10తో ఒర్నికా-సుకిట్టను ఓడించి ప్రిక్వార్టర్స్‌లోకి వెళ్లింది. పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్ మ్యాచ్ వర్షం కారణంగా బుధవారానికి వాయిదా పడింది. లక్ష్యసేన్ 14-21, 7-21తో జెన్ చేతిలో ఓడాడు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**